విశాలాంధ్ర

కృష్ణా, ఎన్టీఆర్ గుంటూరు, పల్నాడు

బుధవారం 04 సెప్టెంబరు 2024 8 పేజీలు

జాతీయ విపత్తుగా ప్రకటించండి

- వరద బాధితులకు అవసరమైన మందులను అందుబాటులో ఉంచాలి
- పార్టీలు రాజకీయం మాని... సహాయం అందించాలి
- ప్రభుత్వం పరిహారమందించి ఆదుకోవాలి : కె.రామకృష్ణ, ముప్పాళ్ల
- మంగళగిరి రత్నాలచెరువును సందర్శించిన సీపీఐ బృందం

విశాలాంధ్ర-మంగళగిరి : రెండు తెలుగు రాష్ట్రాలలో విధ్వంసం సృష్టించిన వరద భీభతాన్ని జాతీయ విపత్తుగా ప్రకటించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ కోరారు. భారీ వర్షాల కారణంగా ముంపుకు గురైన గుంటూరు జిల్లా మంగళగిరి పట్టణంలోని రత్నాల చెరువు కాలనీని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావులతో కూడిన బృందం మంగళవారం పరిశీలించింది. నీట మునిగిన వీధులతో పాటు చేనేత మగ్గాలను వారు పరిశీలించారు. బాధితుల సమస్యలను మిగతా 2 లో ...

ముంపులోనే...!

- స్వల్పంగా వరద తగ్గినా ముంపులోనే వేలాది ఇళ్లు
- మూడు రోజులుగా సాయం అందక బాధితుల గగ్గోలు
- అష్టకష్టాలు పడుతూ సొంతంగా నీటిలో నుంచి బయటకు
- బంధువులు, స్నేహితుల ఇళ్లలోనే తలదాచుకుంటున్న బాధితులు
- భారీగా డబ్బులు డిమాండ్ చేస్తున్న బోట్ల యజమానులు
- పాలు, కూరగాయలు, సరుకుల ధరలు పెంచేసిన వ్యాపారులు

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): విజయవాడ నగరం, పరిసర ప్రాంతాలు ఇంకా వరద నీటిలోనే నానుతున్నాయి. బుడమేరు, కృష్ణా నది కాస్త శాంతించడంతో కొన్ని ప్రాంతాల్లో వరద కొద్ది మేర తగ్గింది. అయితే వరద ముంపు మాత్రం తగ్గలేదు. అంబాపురం, జక్కంపూడి వైఎస్సార్ కాలనీ, పాముల కాలువ, చనుమోలు ఫ్లై ఓవర్, కబేళా, ఊర్మిళానగర్, విద్యాధరపురం, భవానీపురం, వించిపేట, కొత్త, పాత రాజరాజేశ్వరీపేటలు, సింగ్ నగర్, పాయకాపురం ప్రాంతాలు ఇంకా వరదలోనే మగ్గుతున్నాయి. మూడు రోజులుగా ప్రభుత్వం నుంచి సాయం అందక బాధితులు గగ్గోలు పెడుతున్నారు. ఇక ప్రభుత్వ సాయం కోసం ఎదురు చూడకుండా బాధితులే నీటిలో ఈదుకుంటూ బయటకు వస్తున్నారు. తమ ఇళ్లు, సామాన్లు వదలి ప్రాణాలు మిగతా 2 లో ...

వరద బాధితుల పునరావాస కేంద్రాలను పెంచాలి

సీపీఐ కృష్ణా జిల్లా కార్యదర్శి టీ.తాతయ్య



విశాలాంధ్ర-మచిలీపట్నంటౌన్ : కృష్ణాజిల్లాలో రెండు రోజులుగా కురిసిన భారీ వర్షాలతో జనజీవనం అతలాకుతలమైందని, లక్షలాది ఎకరాల పంట నీటి మునిగి ప్రజలు అల్లాడుతున్నారని, ప్రభుత్వం పునరావాస కేంద్రాలను పెంచి ముంపు బారిన పడిన ప్రజలను ఆదుకోవాలని సీపీఐ కృష్ణా జిల్లా కార్యదర్శి టీ.తాతయ్య డిమాండ్ చేశారు. మంగళవారం మిగతా 2 లో ...

మృతుల కుటుంబాలకు
రూ.10 లక్షలు ఇవ్వాలి

సీపీఐ ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి దోనేపూడి శంకర్

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): విజయవాడ వరదను జాతీయ విపత్తుగా ప్రకటించాలని, వరద కారణంగా మరణించిన కుటుంబాలకు 10 లక్షలు నష్ట పరిహారం చెల్లించాలనీ సీపీఐ ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి దోనేపూడి శంకర్ డిమాండ్ చేశారు. సిపిఐ ఎన్టీఆర్ జిల్లా సమితి ఆధ్వర్యంలో విజయవాడ పాత రాజరాజేశ్వరి పేటలో వరద సహాయక చర్యల్లో పాల్గొని మంచినీటి బాటిళ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మిగతా 2 లో ...

నిత్యావసరాల ధరలు తగ్గించాలి

-వరద బాధితులకు రూ.5 వేల కోట్లు విడుదల చేయాలి
-సీపీఐ పల్నాడు జిల్లా కార్యదర్శి మారుతి వరప్రసాద్

విశాలాంధ్ర-వినుకొండ: దేశంలో పెరిగిన అధిక ధరలను నియంత్రించడంలో కేంద్రం పూర్తిగా వైఫల్యం చెందిందని పెరిగిన అధిక ధరలను తగ్గించాలని, మిగతా 2 లో ...

కేంద్రం తక్షణ సాయం అందించాలి

సీపీఐ నగర కార్యదర్శి జి.కోటేశ్వరరావు

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): బుడమేరు, కృష్ణా వరద ముంపును జాతీయ విపత్తుగా ప్రకటించాలని సీపీఐ నగర కార్యదర్శి జి.కోటేశ్వరరావు అన్నారు. మంగళవారం భవానీపురం, జోజి నగర్‌లో కోటేశ్వరరావు సీపీఐ నాయకులతో కలిసి వరద బాధితులకు ఆహారం, మంచినీరు బాటిళ్లు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరద ముంపును జాతీయ విపత్తుగా ప్రకటించాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రజలను బయటకు తీసుకువచ్చి సురక్షిత ప్రాంతాలకు తరలించాలని చెప్పారు. బాధితులను ఆదుకోవడంలో మరింత సహాయక చర్యలు చేపట్టాలని మిగతా 2 లో ...

అధికారులు అప్రమత్తం : కలెక్టర్ నాగలక్ష్మి -8

పొలాలను పరిశీలించిన హార్టికల్చర్ డైరెక్టర్-5

మూగజీవాలకు గ్రాసం అందించాలి - 4

రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి-3

(మొదటి పేజీ తరువాయి)

ముంపులోనే...!

అరిచేతిలో పెట్టుకుని ట్యూబులు, థర్మాకోల్ షీట్లు సాయంతో వరద నుంచి బయటకు చేరుతున్నారు. ప్రభుత్వం హెలికాప్టర్లు, డ్రోన్లు, బోట్లు అంటూ ఆర్భాటపు ప్రచారం చేస్తోందని, వాస్తవానికి అసలు బాధితులకు ఎటువంటి సాయం అందడం లేదని పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ధరలు పెంచి దోపిడీ

సాటి మనుషులు కష్టాల్లో కన్నీరు పెడుతుంటే ఆదుకోవాల్సిన వ్యాపారులు మానవత్వం మరచి దోపిడీకి పాల్పడుతున్నారు. బోటు కనిపించగానే వరద ముంపులో చిక్కుకున్నవారు ఆశగా దగ్గరకు వెళితే రూ.1,000 నుంచి రూ.1,500 వరకు అడుగుతుండటంతో బాధితులు బిత్తరపోతున్నారు. అష్టకష్టాలు పడి షాపుల వద్దకు వెళితే పాలు అర లీటరు ప్యాకెట్ రూ.80, టమాటాలు కిలో రూ.100 .. ఇలా కూరగాయలు, నిత్యావసరాల ధరలు ఇష్టానుసారం పెంచేస్తున్నారు. మరోవైపు దాతలు ముంపు ప్రాంతాలకు తెచ్చిన వాటర్ బాటిళ్లు, ఆహార ప్యాకెట్లను సైతం కొందరు బయట వ్యక్తులు తీసుకుని అమ్ముకుంటున్నారు. దీంతో నిజమైన బాధితులకు సాయం అందక ఆకలితో అలమటిస్తున్నారు. మూడు రోజులుగా పలు ప్రాంతాల్లో కరెంటు లేక సెల్ ఫోన్లు పని చేయడం లేదు. ఇక కాస్త డబ్బులు ఉన్నవారు తమ ఇళ్లను వదిలి లాడ్జిల్లో ఉంటున్నారు. దీంతో విజయవాడ లోని లాడ్జిలు వరద బాధితులతో నిండిపోతున్నాయి.

పునరావాస కేంద్రానికి 10 రోజుల పసిపాప

పది రోజుల పసిపాప, బాలింతను సీపీ ఎస్వీ.రాజశేఖరబాబు పునరావాస కేంద్రానికి తరలించారు. వరద ఉధృతిని పర్యవేక్షిస్తూ ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ బృందాలు, ఫైర్, పోలీసు అధికారులు సహకారంతో లోతట్టు ప్రాంతాల్లో సహాయ కార్యక్రమాలు చేపట్టారు. నీట మునిగిన ప్రాంతాల నుంచి ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నారు. లోతట్టు, కొండ ప్రాంత వాసులు ముందస్తుగా సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లాలని సూచించారు.

మృతుల కుటుంబాలకు రూ.10 లక్షలు ఇవ్వాలి

ఆయన మాట్లాడుతూ వరదను జాతీయ విపత్తుగా ప్రకటించాలని, మరణించిన కుటుంబాలకు 10 లక్షలు నష్ట పరిహారం చేయాలని, భూ ఆక్రమనల ఫలితంగానే బుడమేరు వరద ఉధృతి ఏర్పడిందని చెప్పారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం అక్రమాలపై దృష్టి సారించాలని అన్నారు. వరద సహాయక చర్యల్లో సిపిఐ శ్రేణులు పాల్గొనడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు పరుచూరి రాజేంద్ర బాబు, డిహెచ్‌పిఎస్ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి బుట్టి రాయప్ప, ఎఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు లంకా గోవింద రాజులు, సీపీఐ నాయకులు సంగుల పేరయ్య, జల్దీ చిన్నా తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితుల పునరావాస కేంద్రాలను పెంచాలి

జిల్లాలో విస్తృతంగా పర్యటించి ప్రజలతో మమేకమై, వారి సమస్యలను క్షుణ్ణంగా పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడుతూ, అల్పపీడన ప్రభావంతో రెండు రోజులుగా కురిసిన భారీ వర్షాల వల్ల మచిలీపట్నం, పెడన, చల్లపల్లి, అవనిగడ్డ గ్రామాల్లో పంట పొలాలు ఎటు చూసినా వరద నీరు దర్శనమిస్తుందని, లక్షలాది ఎకరాల వరిచేలు, చెరువులు నాశనం అయిపోయాయని, ఉయ్యూరు, తోట్లవల్లూరు, పెనమలూరు, లంక భూముల్లో కంద, పసుపు, అరటి, చెరకు వంటి వాణిజ్య పంటలు పనికి రాకుండా పోయాయని, మురుగు నీటి కాలువలు పూడిక తీయక పోవటం గుర్రపు డెక్క తొలగించకపోవడం దీనికి కారణం అని వెంటనే వీటిని తొలగించే కార్యక్రమం మొదలు పెట్టాలని కోరారు. గ్రామాల్లో నీరు చేరి అల్లాడిపోతున్న ప్రజలకు తాగునీటి సౌకర్యం కల్పించి పాలు ఆహారాన్ని అందించాలని అన్నారు.ప్రమాద ప్రాంతాల్లో ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించి ప్రాణ నష్టం నివారించాలని కోరారు.

సురక్షితప్రాంతాలకు 300 మంది

విశాలాంధ్ర విజయవాడ స్పోర్ట్స్ : ఆంధ్రప్రదేశ్ క్రీడా ప్రాధికార సంస్థ (శాప్) వైస్ చైర్మన్ మేనేజింగ్ డైరెక్టర్ ఆదేశాల మేరకు ఎన్టీఆర్ జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ డిఎస్ డిఓ అజీజ్ ఆధ్వర్యంలో జిల్లాలోని కోచ్ లు రాజరాజేశ్వరిపేట విజయవాడలోని వరద శరణార్థులను 300 మందిని వరద ప్రాంతాలనుండి సురక్షితప్రాంతాలకు తారలించారు.వరద ప్రాంతంలోని 100 కుటుంబాలకు ఆహారం, తాగునీరు, బన్నునీ పాల పాకెట్లు, బిస్కెట్ పాకెట్స్, కొవ్వత్తులు మరియు అగ్గిపెట్టెలు అందించారు.ఇందిరా గాంధీ మున్సిపల్ కార్పొరేషన్ స్టేడియం నుండి వరద ప్రాంతంలోని కుటుంబాలకు లారీ, ట్రాక్టర్ తో ఆహారం, తాగునీరు, బన్నును, పాల పాకెట్లు, బిస్కెట్ పాకెట్స్, కొవ్వత్తులు మరియు అగ్గిపెట్టెలు అందించారు.ఈ కార్యక్రమం లో డిఎస్ఎ కోచ్ లు కె.జగదీస్, పి.రవి, ఇ.శ్రీను, కె.భాస్కర్, ఎస్.సంతోష్ కుమార్, ఐ. సీతా రామజనీలు, ఎస్కె రియాజ్, ఎస్కె ముంతాజ్ బాగం, కె.స్వామి, వాటర్ స్పోర్ట్స్ కోచ్ ఎం. శ్రీను జాతీయ క్రీడాకారులు జగదీష్, నాగేంద్ర, రాజేష్ గ్రౌండ్ స్టాఫ్ ఎన్. జార్జ్, డి. దుర్గారావు, జి.దిలీప్ కుమార్, ఆర్.సుబ్బారావు, ఎ.అప్పారావు లు పాల్గొన్నారు.

జాతీయ విపత్తుగా ప్రకటించండి

అడిగి తెలుసుకున్నారు. పూర్తిస్థాయిలో డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడం వలనే వర్షాలు వచ్చినప్పుడు సమస్యలు తలెత్తుతున్నాయని బాధితులు సీపీఐ నాయకులకు విన్నవించుకున్నారు. ఈ సందర్భంగా రామకృష్ణ మీడియాతో మాట్లాడుతూ గత దశాబ్ద కాలంలో ఏనాడూ చూడని విపరీత వర్షాల వల్ల ఉమ్మడి గుంటూరు జిల్లా, ఉమ్మడి కృష్ణా జిల్లాలు పూర్తిగా అతలాకుతలమయ్యాయని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా కూడా ఇప్పటివరకు 20 మంది వరదల్లో చనిపోయారని వార్తలు వస్తున్నాయని, లక్షలాది మంది బతుకులు అతలాకుతలమైపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. అనేక గృహాలలో కరెంటు లేదు... తాగడానికి నీళ్లు కూడా అందించడం కష్టంగా ఉందని అన్నారు. మరికొన్ని చోట్ల కూలీ పనులు చేసుకునే వారు, చేనేత మగ్గాలపై ఆధారపడి జీవనం సాగించే వారు తీవ్రంగా ఇబ్బందులుపడుతున్నారన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఇతర ప్రభుత్వ యంత్రాంగం కూడా చక్కగా పనిచేస్తున్నారన్నారు. ప్రభుత్వాలు ఎంత సాయమందించిన అనేక చోట్ల నీరు, ఆహారం అందడం లేదని అన్నారు. చాలా చోట్ల వైరల్ ఫీవర్‌తో ప్రజలు ఇబ్బందిపడుతున్నారని చెప్పారు. వరద బాధితుల సహాయార్థం ఎక్కడికక్కడ వైద్యులను, మందులను సిద్ధం చేసి ఉంచాలని రామకృష్ణ ప్రభుత్వాలకు సూచించారు. రాజకీయ పార్టీలు కూడా రాజకీయాలు చేయడం మానేసి రాష్ట్ర ప్రభుత్వానికి సహకరించేందుకు ముందుకు రావాలని రామకృష్ణ కోరారు. తెలంగాణ రాష్ట్రం ఉమ్మడి ఖమ్మం జిల్లా, ఉమ్మడి నల్గొండ జిల్లాలో కూడా తీవ్రమైన వర్షాలకు అక్కడి ప్రజలు ఇబ్బందులుపడుతుంటే అక్కడి ప్రభుత్వం కూడా ఇక్కడి ప్రభుత్వం మాదిరిగా స్పందించడం సంతోషకరమైన విషయమని అన్నారు. తెలంగాణాలో మాదిరి ఆంధ్రాలో కూడా తీవ్రమైన వరద వచ్చిందన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ రెండు తెలుగు రాష్ట్రాలకు పర్యటనకు రావాలని రామకృష్ణ డిమాండ్ చేశారు. తెలుగు రాష్ట్రాల్లో జరిగిన వరద బీభత్సాన్ని, జాతీయ విపత్తుగా ప్రకటించి ఆదుకోవాలని కోరారు. దీనికోసం రాష్ట్ర ప్రభుత్వాలు కేంద్రంపై ఒత్తిడి తేవాలని సూచించారు. సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు మాట్లాడుతూ గత వారం రోజులుగా రాష్ట్రంలో కురుస్తున్న భారీ వర్షాలకు, అలాగే కృష్ణానదికి వచ్చిన వరద కారణంగా కృష్ణా, గుంటూరు జిల్లాలు పూర్తిగా నష్టపోయాయని అన్నారు. విజయవాడ నగరం విధ్వంసానికి గురైందని అన్నారు. మంగళగిరి ప్రాంతం నుంచి రేపల్లె దాకా భారీ వర్షాలతో లక్షలాది ఎకరాలు పంట పొలాలు నీట మునిగిపోయాయని ముప్పాళ్ల ఆవేదన వ్యక్తం చేశారు. మంగళగిరి రత్నాల చెరువు కాలనీ ప్రాంతంలో ఉన్న సుమారు 1500 మగ్గాలు గుంటల్లోకి నీళ్లు చేరి గత వారం రోజుల నుంచి పనులు లేకుండా పోయిన పరిస్థితి ఉందని అన్నారు. అయితే ఎప్పటికప్పుడు మోటర్లు పెట్టి నీటిని తోడించటం వలన కొంత ఉపశమనం జరిగినప్పటికీ చేనేత కార్మికుల వృత్తి సంక్షోభంలోకి నెట్టువేయబడిందన్నారు. పని కోల్పోయారని చెప్పారు. వెంటనే రాష్ట్ర ప్రభుత్వం స్పందించటం అభినందనీయమే అయినా జీఓ 5 ప్రకారం చేనేత కార్మికులకు ఎంత నష్టం జరిగిందో దాన్ని పూర్తిస్థాయిలో ప్రభుత్వం భర్తీ చేసే విధంగా ఉండాలని ముప్పాళ్ల కోరారు. ఇటువంటి విపత్కర పరిస్థితులలో అందరూ రాష్ట్ర ప్రభుత్వానికి సహాయ సహకారాలు అందించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిల్లలమర్రి నాగేశ్వరరావు, సీపీఐ మంగళగిరి నియోజకవర్గ కార్యదర్శి చిన్ని తిరుపతయ్య, మండల కార్యదర్శి జాన్ బాబు, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ నందం బ్రహ్మేశ్వరరావు, గంజి పట్టాభి, గంజి వెంకయ్య, బత్తుల గిరి, దొడ్డి ఈశ్వరరావు, బత్తూరి మోహనరావు, గజవల్లి వెంకటకృష్ణ, కాకర్ల నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

వరద సహాయక చర్యలు

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): కృష్ణానది, బుడమేరు వరద బాధిత సహాయక కార్యక్రమాలను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్వయంగా పర్యవేక్షించడాన్ని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు గుజ్జుల ఈశ్వరయ్య, ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి దోనేపూడి శంకర్ స్వాగతించారు. ఎన్టీఆర్ జిల్లాలో వరద సహాయక చర్యలలో సీపీఐ శ్రేణులు పాల్గొనాలని పిలుపునిచ్చారు. కృష్ణలంకలోని పలు ప్రాంతాలను పరిశీలించి రణదీవే నగర్ కరకట్ట మీద రిటైనింగ్ వాల్ దగ్గర ఉన్న పరిస్థితిని పరిశీలించి స్థానిక ప్రజలు, కార్పొరేటర్‌ని అడిగి వరద పరిస్థితుల గురించి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బుడమేరు ఆక్రమణల ఫలితంగానే ఈరోజు విజయవాడ నగరంలో సుమారు 26 డివిజన్లో మేర వరద ఉధృతి కారణంగా ఇళ్ళు నీట మునిగి జనజీవనం స్తంభించిందని కొత్త రాజరాజేశ్వరి పేట, పాత రాజరాజేశ్వరి పేట, సింగ్‌నగర్‌లోని పలు ప్రాంతాలలో ఇప్పటికీ సహాయ చర్యలు లేక తాగేందుకు మంచినీరు కూడా లేక స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తక్షణమే వారికి సహాయ చర్యలు అందించాలని ప్రభుత్వ అధికారులతో మాట్లాడడం జరిగిందని ఎన్టీఆర్ జిల్లాలో వరద ఉధృతి కారణంగా నీట మునిగి వేలాది ఎకరాలు పంట నష్టం జరిగిందని కట్టలేరు, మునేరు, పులిచింతల, తెగి గ్రామాలలో రాకపోకలు దెబ్బతిన్నాయని తక్షణమే ప్రభుత్వం ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాలని సిపిఐ శ్రేణులు అన్ని ప్రాంతాలలో సహాయక చర్యలు చేపట్టి ప్రజానీకాన్ని సురక్షిత ప్రాంతాలకు చేరవేయడంతో పాటుగా ఆపద సమయంలో ఆపన్న హస్తము అందించాలని నీట మునిగిన ప్రాంతాలలో ప్రజలకు ఆహారం, నిత్యవసర వస్తువులు తక్షణమే అందజేయాలని పిలుపునిచ్చారు.

వరద బాధితులకు భోజనాలు పంపిణీ

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): స్థానిక 32 డివిజన్లో బసవతార్‌నగర్ ముంపు ప్రాంతాల్లో డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో భోజనాలు పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో డివిజన్ కార్యదర్శి డి బి కే రావు నగర కార్యవర్గ సభ్యురాలు డి సీతారామమ్మ ఏఐవైఎఫ్ నాయకులు సిహెచ్ శ్రీధర్ డివిజన్ మహిళ సెక్రటరీ రాజ్యలక్ష్మి మహిళా కమిటీ బుజ్జి రాజమణి అరుణ సీనియర్ నాయకురాలు రాహేలు అమ్మ డివిజన్ యూత్ మెంబర్ జి మనోజ్ డివిజన్ సహాయ కార్యదర్శి రాజు పాల్గొన్నారు

నిత్యావసరాల ధరలు తగ్గించాలి

వరద బాధితులను వెంటనే ఆదుకోవాలని భారత కమ్యూనిస్టు పార్టీ సీపీఐ దేశవ్యాప్త ఆందోళనల పిలుపులో భాగంగా విను కొండంలో మంగళవారం సీపీఐ ఆధ్వర్యంలో నిరసన నిర్వహించారు. ధరల పెరుగుదలను అరికట్టాలని పట్టణంలోని శివయ్య స్తూపం సెంటర్‌లో బూదాల శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన నిరసన కార్యక్రమంలో సీపీఐ పల్నాడు జిల్లా కార్యదర్శి మారుతి వరప్రసాద్ మాట్లాడు తూ 2014లో అధికారంలోకి వచ్చిన కేంద్రం అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లో అధిక ధరలు తగ్గిస్తానని ప్రజలను నమ్మబలికిందని కానీ రాష్ట్రంలోనూ దేశంలోనూ పెరిగిన ధరలు తగ్గించకపోగా ధరల భారాలు పెరిగిపోయి ప్రజలు అల్లాడి పోతున్నారని గత పది సంవత్సరాలుగా దేశంలోనూ రాష్ట్రంలోనూ ధరాభారాలతో సామాన్యుడు కొనుగోలు శక్తి పడిపో యిందనివిమర్శించారు. సీపీఐ ఆధ్వర్యంలో బీజేపీ హటావో దేశ్ కి బచావో నినాదంతో దేశంలో భారతీయ జనతా పార్టీ రైతు కార్మిక ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటాలు కొనసాగుతున్నాయని ఇటీవల జరిగిన ఎన్నికల్లో ప్రజలు దేశంలో బీజేపీని తిరస్కరించారని ప్రాంతీయ పార్టీలపై ఆధారపడి బిజెపి అధికారాన్ని కొనసా గిస్తుందని ఆయన విమర్శించారు. రాష్ట్రంలో ఇటీవల కురిసిన అధిక వర్షాల వల్ల వరదల వల్ల ప్రజలు రైతాంగం తీవ్రంగా నష్టపోయారని జాతీయ విపత్తుగా ప్రకటించి రాష్ట్రానికి కేంద్రం వెంటనే సహాయంగా 5వేల కోట్ల రూపాయలు కేటాయించాలని ఆయన డిమాండ్ చేశారు. రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఉలవలపూడి రాము, సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి బూదాల శ్రీనివాసరావులు మాట్లాడుతూ రాష్ట్రంలో రైతాంగం ఇటీవల కురిసిన వర్షాలు వల్ల తీవ్రంగా నష్టపోయారని వ్యవ సాయ అధికారులు పంట నష్టాలను వెంట నే అంచనా వేసి రైతాంగానికి నష్టపరిహారం చెల్లించాలని, విజయవాడ నగరంలో వరదల వల్ల ప్రవాహం లో మునిగిపోయి న గృహాల వారికి తక్షణ సహాయ సహకారాలు రాష్ట్ర ప్రభుత్వం వెంటనే చేప ట్టాలని కృష్ణ గుంటూరు ఉభయ గోదావరి జిల్లాలో నష్టపోయిన రైతన్న ను ఆదుకో వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు ఆర్. వందనం, పిన్న బోయిన వెంకటేశ్వర్లు, ఎ. పవన్ కుమార్, షేక్ కిషోర్, కే. మల్లికార్జున, సాంబయ్య, సోమవరపు దావీదు, ధూపాటి మార్కు, పి.వెంకట వెంకటేశ్వర్లు, యూనిస్, రాములమ్మ రమణమ్మ పాల్గొన్నారు.

కేంద్రం తక్షణ సాయం అందించాలి

తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం బుడమేరు ప్రాంతాల వాసులకు ముందస్తు హెచ్చరికలు చేయలేదన్నారు. రాష్ట్రంలో వచ్చిన విపత్తును కేంద్ర ప్రభుత్వం జాతీయ విపత్తుగా ప్రకటించి తక్షణ సహాయం అందించాలని డిమాండ్ చేశారు. బాధితులను ఆదుకోవడంలో కావాల్సిన సిబ్బంది, రవాణా సదుపాయాలు, సామాగ్రిని కేటాయించి, కేంద్రం అన్ని విధాలుగా ఆదుకోవాలని చెప్పారు. ఇంటి నుంచి బయటకు రాలేక ఇబ్బందులు పడుతున్న బాధితులకు ఇంటింటికి వెళ్లి పాలు, మంచినీరు, ఆహారం, అందించే ఏర్పాట్లు చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నగర కార్యదర్శివర్గ సభ్యులు తాడి పైడియ్య, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు జాన్సన్ బాబు, కోశాధికారి ఎం. సాయికుమార్, ఏఐవైఎఫ్ నగర అధ్యక్షులు కంచర్ల భార్గవ్ తదితరులు పాల్గొన్నారు.

దారి దోపిడీ దొంగలు ఐదుగురు అరెస్ట్

విశాలాంధ్ర-గన్నవరం : గన్నవరం మండలం ముస్తాబాద్ వద్ద దారి దోపిడీలకు పాలుడుతున్న ఐదుగురిని పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాల ప్రకారం ఎన్టీఆర్ జిల్లా జక్కంపూడికి చెందిన వారు దోపిడీలకు పాల్పడుతున్నారని, వారివద్ద నుండి 5 లక్షల 40 వేలు విలువచేసే 90 గ్రాములు బంగారం, 10 గ్రాములు వెండి, బైక్, రెండు సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. వారిపై గన్నవరం, నున్న పోలీస్‌స్టేషన్‌లలో కేసులు ఉన్నాయని తెలిపారు.

కారుకు నిప్పుపెట్టిన గుర్తు తెలియని వ్యక్తులు

విశాలాంధ్ర-గన్నవరం : పట్టణంలో వినోద్ కారు సెంటర్‌లో సోమవారం అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తులు కారును దగ్ధం చేశారు. సుమారు ఒంటిగంట సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు పెట్రోల్ పోసి కారుకి నిప్పంటిచ్చి పరారయ్యారు. స్థానికులు సమాచారం మేరకు ఫైర్ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని మంటలను అదుపు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వినాయక చవితికి అనుమతులు తప్పనిసరి

విశాలాంధ్ర-ఏ కొండూరు : వినాయక చవితి ఉత్సవాలు నిర్వహించే వారి సౌకర్యార్థం మండపాల అనుమతికి విజయవాడ పోలీస్ కమిషనర్ సింగిల్ విండో సిస్టంను అందుబాటులోకి తెచ్చినట్లు ఎస్సై చల్లా కృష్ణ తెలిపారు. మంగళవారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ మండలంలోని వివిధ గ్రామాల్లో వినాయక చవితి ఉత్సవాలు నిర్వహించే కమిటీ సభ్యులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. మీసేవ కేంద్రాల ద్వారా రుసుము చెల్లించి వినాయక మండపాల అనుమతులు తీసుకోవాలని సూచించారు. 799 50 95 800 ఫోన్ నెంబర్ కు వాట్సప్ ద్వారా హాయ్ అని సందేశాన్ని పంపిస్తే సరిపోతుందన్నారు. ఎన్ఓసి కోసం అనుసరించాల్సిన ప్రక్రియ మొత్తం వాట్సాప్ యాప్ ద్వారా వారి మొబైల్ ఫోన్‌కి వస్తుందని చెప్పారు.

వరద బాధితులకు చీరలు దుప్పట్లు పంపిణీ

విశాలాంధ్ర-జగ్గయ్యపేట: వరద బాధితులను ఆదుకునేందుకు స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావడం అభినందనీ యమని జగ్గయ్యపేట ఎమ్మెల్యే శ్రీరామ్ రాజగోపాల్ తాతయ్య ప్రశంసించారు. డాక్టర్ చింత రంగధామారావు చారిటబుల్ ట్రస్ట్, సెల్ హెల్త్ హాస్పిటల్స్ చైర్మన్ డాక్టర్ చింతా రవికుమార్ ఆధ్వర్యంలో జగ్గయ్యపేట మండలం బూధవాడ వరద బాధితులకు 200 చీరలు 200 దుప్పట్లు జగ్గయ్యపేట శాసనసభ్యులు శ్రీరామ్ రాజగోపాల్ తాతయ్య కు ట్రస్ట్ ప్రతినిధి అజయ్ అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీరామ్ తాతయ్య మాట్లాడుతూ వరదలతో ప్రజలు తీవ్రంగా నష్టపోవడం జరిగిందన్నారు. వరద బాధితులను ఆదుకు నేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఎంతగానో శ్రమిస్తోందన్నారు. ట్రస్ట్ ప్రతినిధి కొల్లి అజయ్ రమాకాంత్ మాట్లాడుతూ డాక్టర్ చింత రంగధామారావు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా తమ ట్రస్ట్ తరఫున వరద బాధితులకు చీరలు దుప్పట్లు అందజేసినట్లు పేర్కొన్నారు. హుదూద్ తుఫాన్ సమయంలో 100 టన్నుల కూరగాయలు, పుష్కర సమయంలో భక్తులకు ఉచితంగా భోజన సదుపాయాలు కల్పించడమైనదన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు చినబాబు, తెలుగు నాడు అంగన్వాడి డ్వాక్రా సాధికార సంస్థ రాష్ట్ర అధ్యక్షులు ఆచంట సునీత, ట్రస్ట్ ప్రతినిధులు వేమూరి కాశీ కృష్ణ గొంది ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి

విశాలాంధ్ర-మచిలీపట్నం : నలుగురికి అన్నం పెట్టే రైతు అధిక వర్షాలతో నట్టేట మునిగిపోతున్నారని, ఇటువంటి తరుణంలో ప్రభుత్వాలు వారిని ఆదుకోవాలని కౌలు రైతుసంఘం జిల్లా కార్యదర్శి తుమ్మ చినకొండయ్య విజ్ఞప్తి చేశారు. మండల పరిధిలోని పలు గ్రామాలలో ఇటీవల కురిసిన అధిక వర్షాల్లో నష్టపోయిన రైతులను మంగళవారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు గిట్టుబాటు ధరలు లేక అనేక విధాలుగా ఇబ్బంది పడుతున్నారు. కాయకష్టం చేసుకుని ఏదో విధంగా పంట పండించి ముందుకు సాగుతుంటే ఈ వర్షాలు వచ్చి పంటలను మునిగిపోయి తీవ్ర నష్టాన్ని ఎదుర్కొనాల్సి వస్తుందని రైతులు ఇబ్బందులని ప్రభుత్వం దృష్టిలో పెట్టుకుని తక్షణమే సాయం చేయాలని ఆయన కోరారు. సీపీఐ నాయకులు మోదుమూడి రామారావు మాట్లాడుతూ అధిక వర్షాలతో మండల పరిధిలోని నవీన్ మెటల్‌కాలనీతో పాటు జగనన్న కాలనీలన్నీ జలమయం అయ్యాయని వారికి సరైన సదుపాయాలు లేక ఇబ్బందులు పడుతున్నారని ఆయన వాపోయారు. సీపీఐ నియోజవర్గ కార్యదర్శి లింగం ఫిలిప్ మాట్లాడుతూ బందరు మండలంలోని చిట్టిపాలెం, హుస్సేన్ పాలెం, అరిసేపల్లి పలు గ్రామాలలోనూ పంటలు నీట మునిగి రైతులు ఇబ్బందులు పడుతున్నారని వారికి ప్రభుత్వం తక్షణ సాయం అందజేయాలని ఆయన అన్నారు. సీపీఐ నియోజక వర్గ సహాయ కార్యదర్శి ఓడుగు చైతన్య కుమార్, ఏఐటీయూసీ పట్టణ కార్యదర్శి ఓ.ఎల్‌రావు, సీపీఐ నాయకులు మోదుమూడి నాగరాజు జగనన్న కాలనీలు, మునిగిన పంట పొలాలను పరిశీలించిన వారిలో ఉన్నారు.

గుడివాడ నుంచి వరద బాధితులకు 50 వేల ఆహార ప్యాకెట్లు

విశాలాంధ్ర-గుడివాడ : వరదల ప్రభావంతో అతలాకుతలం అయిన ప్రజల సహాయార్థం ఎమ్మెల్యే వెనిగండ్ల ఆధ్వర్యంలో రాము 50వేల బిర్యానీ, పులిహోర ప్యాకెట్ల ఆహార ప్యాకెట్లతో కూడిన వాహనాలను టిడిపి నాయకుడు కామేపల్లి తులసి బాబు జెండా ఊపి ప్రారంభించారు. మంగళవారం స్థానిక ఏలూరు రోడ్డులోని టిడిపి కార్యాలయంలోని ప్రజా వేదిక వద్ద కూటమి పార్టీల నాయకులతో కలసి తులసిబాబు మాట్లాడుతూ భారీ వరదల వల్ల ఉమ్మడి కృష్ణాజిల్లా, గుంటూరు జిల్లాలోని ప్రజలు తీవ్రంగా నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే వెనిగండ్ల రాము సమకూర్చిన ఆహార ప్యాకెట్లు విజయవాడలో ఇందిరా గాంధీ స్టేడియంకు చేరుకుంటాయని, అక్కడి నుండి అవసరమైన ప్రాంతాల్లోనీ ప్రజలకు అధికారులు పంపిణీ చేస్తారన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ యలవర్తి శ్రీనివాసరావు, అర్బన్ బ్యాంక్ మాజీ చైర్మన్ పిన్నమనేని బాబ్జి, పట్టణాధ్యక్షుడు దింట్యాల రాంబాబు, జనసేన నాయకులు బూరగడ్డ శ్రీకాంత్, రూరల్ మండల అధ్యక్షుడు వాసే మురళి, నాయకులు వసంతవాడ దుర్గారావు పాల్గొన్నారు.

గోడ కూలి మహిళకు తీవ్రగాయాలు

విశాలాంధ్ర-చల్లపల్లి : ఆముదార్లంకలో గోడ కూలి మహిళకు తీవ్రగాయాలయ్యాయి. పల్లెపాలెంకు చెందిన వక్కలగడ్డ నాగమణి గోడమీదుగా మంచాన్ని బయటకు దించుతుంటే గోడ కూలిపోయింది. తలకు, నడుముకు తీవ్రగాయాలు కాగా, తండ్రి జగన్మోహనరావుకు స్వల్ప గాయాలయ్యాయి. వెంటనే వారిని లాంచీలో కరకట్టమీదకు తీసుకువచ్చి అంబులెన్స్‌లో మచిలీపట్నం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఇన్చార్జి డీటీ ఘంటసాల కృష్ణమోహన్ సహాయక చర్యలను పర్యవేక్షించారు.

చీరలు పంపిణీ

విశాలాంధ్ర-పెదపారుపూడి : మండలంలోని జమీదెంటకుర్రు, వింజనంపాడు, మోపర్రు, గ్రామాలలో నీటమునిగిన గృహాల పేద మహిళమ్మ తల్లులకు ఎమ్మెల్యే చీరలను మంగళవారం పంపిణీ చేశారు. పెదపారుపూడి నాలుగు రోడ్ల కూడలిలో వర్షాలకు నీట మునిగిన 15 కుటుంబాల పేదలకు బియ్యం నిత్యవసర సరుకులతోపాటు చీరలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ చప్పిడి సమీరా కిషోర్, మండల పార్టీ అధ్యక్షుడు చలసాని రమేష్ చౌదరి, ప్రధాన కార్యదర్శి మసి ముక్కు రాంబాబు, టిడిపి సీనియర్ నాయకుడు సూరపునేని వెంకట సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

మహిళా చట్టాల పై అవగాహన సదస్సు

విశాలాంధ్ర-గూడూరు: హ్యూమన్ రైట్స్ ఫౌండేషన్ జనరల్ సెక్రటరీ డాక్టర్. గోవాడ ప్రశాంతి ఆధ్వర్యంలో మంగళవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మల్లవోలు నర్సింగ్ స్టాఫ్ ఆశ వర్కర్స్ డాక్టర్ సిబ్బందితో అవగాహనా సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కె.వి రామకృష్ణయ్య, మానవహక్కులు మహిళల చట్టాల గురించి అవగాహన కల్పించారు. అజ్జీన్నిసా మాట్లాడుతూ వినియోగదారుల చట్టాలు గురించి వివరించారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ఎం పి హెచ్ ఈ ఓ వీరయ్య , తాతబ్బాయి, హెచ్ది సరళా, డాక్టర్ మైత, ఆశావర్కర్లు, ఏఎన్ఎంలు, అందరూ పాల్గొనడం జరిగినది ముఖ్యంగా మల్లవోలు పురవీధులలో పర్యావరణ పరిరక్షణలో ర్యాలీ న్యాయసేవా సదన్ కార్యదర్శి కె.వి రామకృష్ణయ్య తోకే పి హెచ్ సి లో మొక్కలు నాటారు.

వాణిజ్య పంటలకు అపార నష్టం

విశాలాంధ్ర-పమిడిముక్కల: భారీ వర్షాలకు మండలంలో వరి పంట, వాణిజ్య పంటలకు అపార నష్టం ఏర్పడిందని రైతులు ఆందోళన చెందుతున్నారు.మంగళవారం నాటికి వరి పైరు నీటి నుండి బయట పడిందని,పల్లపు ప్రాంతంలో మునిగిపోయి వుందని కుదుళ్ళు నాని కుళ్ళిపోతాయే నని ఆందోళన చెందాల్సిన వస్తోందని రైతులు వాపోతున్నారు.కూడేరు ఐనపూరు అగినపర్రు హనుమంతపురం ముళ్ళపూడి ఐనంపూడి మర్రివాడ తదితర గ్రామాల్లో వాణిజ్య పంటలకు అపార నష్టం ఏర్పడిందని కాయకూరలు కళ్ళిపోతున్నాయని పసుపు బొప్పాయి కంద పొలాల్లో నీరు పోలేదని తెలిపారు.

ప్రజలను కాపాడటం అందరి బాధ్యత

విశాలాంధ్ర-జగ్గయ్యపేట : స్థానిక మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ అధికారులు, జగ్గయ్యపేట సచివాలయాల సిబ్బంది ప్రజా ప్రతినిధులతో మునిసిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర మంగళవారం అత్యవసర సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ వరదలు వచ్చి జగ్గయ్యపేట పట్టణ ప్రజలు బాధపడుతుంటే రాజకీయ నాయకులు తప్ప ఇప్పటి వరకు కనీస బాధ్యతగా ప్రజలను కలిసారా అని అధికారులను ప్రశ్నించారు. మీ సచివాలయం సిబ్బంది పని చేస్తున్నారా లేదా అని చూడాల్సిన బాధ్యత వార్డు అడ్మిన్స్ బాధ్యత అని, రేపు ఉదయం నుంచి వరద ముంపు ప్రాంతాలలో ప్రతి ఇంటికి వెళ్లి వారికి జరిగిన నష్టం ప్రతిదీ రాసుకుని, ఎటువంటి నష్టం జరిగింది, ఆరోగ్య సమస్యలు ఉన్నాయా, వారు పెంచుకునే పశువులు ఏమైనా కొట్టుకుపోయాయా తదితర వివరాలు సాయంత్రంలోపు సేకరించాలన్నారు. ఎమ్మెల్యే శ్రీరామ్ రాజగోపాల్ (తాతయ్య) వరదలు వచ్చిన సమయం నుంచి ప్రజల్లోనే ఉంటు వారి సమస్యలను తెలుసుకుంటున్నారని, ప్రజలకు సహాయ సహకారాలు అందజేస్తున్నారని, ప్రభుత్వం ద్వారా అన్ని రకాల ఆదుకుంటామని ప్రజలకు మీ ద్వారా తెలుపుతున్నాన్నారు. మున్సిపల్ కమిషనర్ గా బాధ్యతలు చేపట్టిన రామ్మోహన్ రావుని సత్కరించి పట్టణ అభివృద్ధికి మీ వంతు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ తుమ్మల ప్రభాకర రావు, కమిషనర్ రామ్మోహన్ రావు,ఎలక్ట్రికల్ ఎ డి ఈ శ్రీనివాసరావు, వార్డు కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

మూగజీవాలకు గ్రాసం అందించాలి

వరద ప్రభావిత ప్రాంతాల్లో సీపీఐ నేతల పర్యటన

విశాలాంధ్ర-మోపిదేవి : మూగ జీవాలకు గ్రాసం అందించాలని సీపీఐ జిల్లా నాయకులు అడ్డాడ ప్రసాద్ బాబు విజ్ఞప్తిచేసారు. వరద ప్రవాహంతో గ్రామాలు నీట మునిగిపోవడంతో కే.కొత్తపాలెం, బొబ్బర్లంక కరకట్టపై తల దాచుకుంటున్న బాధిత కుటుంబాలను సీపీఐ నేతల బృందం మంగళవారం పరామర్శించింది. ప్రభుత్వం నుండి బాధితులకు అందుతున్న సహాయక చర్యల గురించి అడిగి తెలుసుకున్నారు. బాధితులకు భోజనాలు, మంచినీళ్లు, వైద్య సేవలు అందుతున్న తీరును పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేసారు. ఈ సందర్భంగా అడ్డాడ ప్రసాద్ బాబు మాట్లాడుతూ కృష్ణా నదికి తీవ్ర వరద సంభవించడంతో ప్రజలందరూ కట్టుబట్టలతో బయటకు రావాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. కనీసం ఆధార్ కార్డులు, రేషన్ కార్డులు కూడా తీసుకురాలేని పరిస్థితి ఏర్పడిందన్నారు. ఎప్పుడు కృష్ణా నదికి వరద వచ్చిన కొత్తపాలెం, బొబ్బర్లంక గ్రామాలు మునిగిపోతాయని ఈ గ్రామాలు వరద బారిన పడకుండా శాశ్వత పరిష్కారం దిశగా ప్రభుత్వం ఆలోచన చేయాలన్నారు. మూగ జీవాలకు పశు గ్రాసం ఏర్పాటు చేయాలనీ కోరారు. ఈ కార్యక్రమంలో ఏపీ రైతు సంఘం రాష్ట్ర నాయకులు హనుమానుల సురేంద్ర నాధ్ బెనర్జీ, వేమూరి రత్నగిరిరావు, సర్పంచ్ కొక్కిలిగడ్డ మాధవి, సీపీఐ నాయకులు మాలెంపాటి కోటేశ్వరరావు, చంద్ర సుబ్బారావు, డొక్కు శ్రీనివాసరావు, రావి ప్రభు ప్రసాద్, బండి రామకృష్ణ, పెనుమత్స రాజా రత్నం, పెనుమత్స ప్రభాకరరావు ఎంపీటీసీ సభ్యులు చందన రంగారావులు పాల్గొన్నారు.

నీట మునిగిన పొలాలు పరిశీలన

విశాలాంధ్ర-కూచిపూడి : మొవ్వమండలంలో వర్షాలతో ముంపు పాలైన వరి పొలాలను మొవ్వ సబ్ డివిజన్ వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు సూరపనేని శ్యామల, ఏ.వో. కంచర్ల శివప్రసాద్ రైతులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పొలాలలో నిల్వ ఉన్న నీటిని వెంటనే తొలగించుకోవడానికి రైతులు ముందుకు రావాలని సూచించారు. నీరు పోయిన తర్వాత ఎకరానికి 25 కిలోల యూరియా, 15 కిలోల పొటాష్ కలిపి చల్లాలనిపేర్కొన్నారు.

ముంపులోనే వరి పొలాలు

విశాలాంధ్ర-కూచిపూడి : వర్షాలు తగ్గినా మొవ్వ మండలంలో పొలాలు నీటి ముంపు నుంచి కోలుకోలేని స్థితిలో ఉన్నాయి. పాలంకిపాడు గ్రామం మీదుగా కోసూరు వెళ్లే ప్రాంతంలో పొలాలు ముంపునీటితోయధాస్థితిగానే కొనసాగుతున్నాయి.

బురదను తొలగింపు

విశాలాంధ్ర-పెనుగంచిప్రోలు : వరదలతో ఐదవ వార్డులోని అంత ర్గత రోడ్లలో పేరుకు పోయిన బురదను పంచా యతీ సిబ్బంది డోజర్‌తో తొలగించారు. ఈ పనులను సర్పంచ్ వేల్పుల పద్మ కుమారి. కార్యదర్శి జి. శ్యాంబాబు. మాజీ మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు కాకాని పద్మ, రంగిసెట్టి దుర్గా ప్రసాద్, చెక్కా వెంకటరమణ.ఈగ అప్పాజీ. తదితరులు పాల్గొన్నారు.

మోపిదేవి కాలనీలకు ముంపు లేకుండా చర్యలు

విశాలాంధ్ర-చల్లపల్లి : వరద ప్రవాహ ఉధృతికి మోపిదేవి మండలం మోపిదేవి వార్పు వద్ద ఏర్పడిన ఎల్ఎఫ్ఆర్ గేట్ సమస్యను నియోజకవర్గ యువనాయకులు మండలి వెంకట్రామ్, అధికారులు యుద్ధప్రాతిపదికన పరిష్కారం చేశారు. మంగళవారం మోపిదేవి వార్పు వద్ద ఎల్ఎఫ్ఆర్ గేటుకు సమస్య ఏర్పడింది. దీంతో వరద నీరు మోపిదేవి వార్పు దిగువన ఉన్న హౌసింగ్ కాలనీ, ఎస్టీ కాలనీ, చక్రపాణి కాలనీల పరిధిలోని 500ల ఇళ్లపై ప్రభావం చూపించే సమస్య నెలకొంది. ఈ సమస్యను రాత్రి గుర్తించి టోల్ గేట్ సమీపంలో యుద్ధ ప్రాతిపాదికన ఇసుక బస్తాలతో అడ్డుకట్ట వేశారు. అయినా మంగళవారం ఉదయం వరద నీరు ఇసుక మూటల కట్టపై నుంచి ఓవర్ ఫ్లో కావటంతో ఈ సమస్యను నియోజకవర్గ యువనాయకులు మండలి వెంకట్రామ్, శీలం అశ్విన్ కుమార్, జడ్పీటీసీ మెడబలిమి మల్లికార్జునరావు, మాజీ సీడీసీ చైర్మన్ రావి నాగేశ్వరరావు, జనసేన పార్టీ మండల ఉపాధ్యక్షులు భోగిరెడ్డి సాంబశివరావు, డ్వామా పీడీ సూర్యనారాయణ, తహసీల్దార్ శ్రీవిద్య, ఇరిగేషన్ డీఈఈ రావెళ్ల రవికిరణ్, డ్రైనేజీ డీఈఈ పులిగడ్డ వెంకటేశ్వరరావు, ఎస్ఐ సత్యనారాయణ పరిశీలించి సమస్య పరిష్కారం చేశారు. ఎల్ఎఫ్ఆర్ వద్ద సరుగు బాదులు, దడి, ఇసుక మూటలతో యుద్ధ ప్రాతిపదికన అడ్డుకట్ట ఏర్పాటు చేశారు. ఈ పనులను మాజీ ఎంపీపీ కొనకళ్ళ నారాయణ పరిశీలించారు. టీడీపీ మండల అధ్యక్షులు యాసం చిట్టిబాబు, టీడీపీ, జనసేన నాయకులు రావి రత్నగిరి, బండే రాఘవ, గుడివాక శివరాం, మేడికొండ విజయ్, బాదర్ల లోలాక్షుడు, ఘంటసాల రాజామోహనరావు (కన్నయ్య), కోసూరు శివాజీ, యలవర్తి చిన్నా, శోభిల ఏడుకొండలు, తదితరులు పాల్గొన్నారు.

5 నుంచి శత సహస్ర మోదక పూజ

విశాలాంధ్ర-విజయవాడ కల్చరల్ : శృంగేరి జగద్గురువులు భారతీ తీర్థ మహాస్వామి, విధుశేఖర భారతీ స్వామి వారల ఆదేశంతో శ్రీ శివరామకృష్ణ క్షేత్రం (రామకోటి) లో ఈనెల 5 గురువారం నుంచి 29వ తేదీ ఆదివారం వరకు శత సహస్ర మోదక లక్ష్మీ గణపతి హెూమం నిర్వహించబడుతుందని క్షేత్రం ధర్మాధికారి శిష్ఠా హనుమత్ ప్రసాద్ తెలిపారు. లక్ష్మీ గణపతి హెూమం సకల శుభకరం అని తెలిపారు. జగద్గురువులు ఆది శంకరాచార్యులు ప్రతిపాదించిన పంచాయతన విధానంలో శాస్త్రోక్తంగా హెూమం జరుగుతుందని తెలిపారు. ప్రతిరోజు గణపతి పూజ, గణపతి అధర్వ శీర్షోపనిషత్ పారాయణ, ప్రదోష వేళల్లో సహస్రనామార్చనలు జరుగుతాయని తెలిపారు. సంబంధిత వివరాలతో కూడిన కరపత్రాలను ధర్మాధికారి, అతిథులు డాక్టర్ దూళిపాళ రామకృష్ణ తదితరులు ఆవిష్కరించారు.

ఉద్యాన పంటల్లో వర్షపు నీరు తొలగించండి

విశాలాంధ్ర-ఏ కొండూరు : వరదకి గురైన ఉద్యానవన పంటల్లో ఉన్న వరద తొలగించాలని ఉద్యాన శాఖ అధికారి బి నరేంద్ర కుమార్ రైతులకు సూచించారు. మాధవరం రామచంద్రాపురం చీమలపాడు గ్రామాల్లో మంగళవారం వరదలు దాటికి దెబ్బతిన్న ఉద్యానవన పంటలైన బొప్పాయి మిరప వంగ తోటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన రైతులతో మాట్లాడుతూ వర్షాలు తగ్గాక తోటల్లో నీరు నిలిచి ఉంటే ఆ నీటిని పూర్తిగా బయటికి వెళ్ళగొట్టాలని అలానే పంటలకు ఎటువంటి తెగుళ్లు సోకకుండా 191919 కానీ 13.0.45 మందును స్ప్రే చేసి మొక్కలకు అందించవలసిన అవసరం ఉందన్నారు. బొప్పాయి సాగుచేసే రైతులకు ఒక హెక్టార్‌కు 17,500 రాయితీ ఇవ్వడం జరుగుతుందని దీనికోసం రైతులు గ్రామాలలోని ఆర్.బి.కె కేంద్రాల్లో సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏ ఈ ఓ రామచంద్రరావు ఉద్యాన శాఖ సహాయ అధికారి ఎం వెంకటేశ్వరరావు నాగరాజు రామచంద్రాపురం చీమలపాడు గ్రామ టిడిపి నాయకులు బెజవాడ శంకర్ రైతులు పాల్గొన్నారు.

నగరంలో సైమా బ్యూటీ ఎక్స్‌పో ప్రారంభం

విశాలాంధ్ర-విజయవాడ లబ్బీపేట : నగరంలోని స్థానిక ఎస్ఎస్ కన్వెన్షన్ లో సైమా బ్యూటీ ఎక్స్ పో ప్రారంభమైనట్లు ఎస్ బి ఎం ఎస్ కో ఫౌండర్, డైరెక్టర్ బి రాఘవీరెడ్డి, సైమా ఫౌండర్ మోక్ష్ తెలిపారు. రెండు రోజులు జరిగే ఈ బ్యూటీ ఎక్స్పో అనేది అందుబాటు ధరలలో బ్యూటీ ప్రొడక్ట్స్ ని అందరికీ అందుబాటులోకి తీసుకురావడమే తమ లక్ష్యం అన్నారు. సైమా బ్యూటీ ఎక్స్పో అనేది ముంబాయి, తెలంగాణ రాష్ట్రంలోని హైదరాబాద్ మరికొన్ని ముఖ్య నగరాలలో నిర్వహించామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆర్గనైజర్ కే శ్రీనివాస్(మాలియో కాస్మెటిక్స్), బి శ్రీనివాస్ (బీ ఈ బీ కాస్మెటిక్స్), ఎం శ్రీనివాస్(ఫెయిర్ టచ్ ఆర్గానిక్ ప్రొడక్ట్స్), విల్సన్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి నగరంలో 'వసంతం 2024'

- క్రాఫ్ట్ కౌన్సిల్ ఆఫ్ ఏపీ చైర్ పర్సన్ ఎస్ రంజన

విశాలాంధ్ర-విజయవాడ లబ్బీపేట: క్రాఫ్ట్ కౌన్సిల్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో ఈ నెల 4,5 తేదీలలో నగరంలోని శేష సాయి కళ్యాణ వేదికలో వసంతం 2024 నిర్వహించనున్నట్లు క్రాఫ్ట్ కౌన్సిల్ ఆఫ్ ఆంధ్ర ప్రదేశ్ చైర్ పర్సన్ ఎస్ రంజన, సంయుక్త కార్యదర్శి బి సుజాత తెలిపారు. ఈ సందర్భంగా మంగళవారం నగరంలోని శేష సాయి కళ్యాణ వేదికలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మీరు మాట్లాడుతూ రెండు రోజులపాటు నిర్వహించే దేశ నలుమూలల నుండి చేనేత కార్మికులు పాల్గొంటున్నారన్నారు. ఇందులో పాల్గొనేవారు తమ ప్రాంతాల నేత కార్మికులు, కళాకారులతో కలిసి పనిచేసిన డిజైన్లను ప్రదర్శిస్తారన్నారు. ఈ వసంతం 2024 కార్యక్రమాన్ని నాలుగో తేదీ ఉదయం 10 గంటలకు ముఖ్య అతిధిగా గుమ్మళ్ళ సృజన (ఐఏఎస్), యన్.టి.ఆర్ జిల్లా కలెక్టర్, మెజిస్ట్రేట్ ప్రారంభిస్తారని తెలియజేశారు.

ఇటు సాయం...అటు సహాయం...

విశాలాంధ్ర-విస్సన్నపేట టౌన్: జిల్లాలో ముంపుకు గురైన విజయవాడ తదితర ప్రాంతాలకు సాయం చేసేందుకు దాతలు ముందుకు రాగా, మండలంలో తుఫానుతో ఏర్పడిన నష్టాలను అంచనా వేసేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. వాసవీక్లబ్ ఆధ్వర్యంలో విజయవాడ తరలించేందుకు తయారు చేసిన రూ.30వేల విలువైన భోజనం ప్యాకెట్లను తహశీల్దారు లక్ష్మీకల్యాణికి అందజేయగా, పచ్చళ్ల తయారీ పరిశ్రమ నడుపుతున్న నాదెళ్ల నాగమణి సుమారు రూ.18వేల విలువైన పచ్చళ్లను బాధిత కుటుంబాలకు అందించేందుకు సమకూర్చారు. తహశీల్దారు లక్ష్మీకల్యాణి, ఎంపీడీఓ ఎస్.వెంకటరమణ, అధికారులు తుఫాను నష్టాల అంచనాకు పరిశీలన చేశారు.

ఆక్విడేట్ పైగా వరద ప్రవాహం

విశాలాంధ్ర-అవనిగడ్డ : కృష్ణమ్మ ఉగ్రరూపం దాల్చి లంక గ్రామాలపై విరుచుకుపడింది. కృష్ణా కరకట్ట ఏ క్షణంలో ఎక్కడ గండి పడుతుందోనని పరిశీలించారు. మంగళవారం కృష్ణమ్మ శాంతించడంతో వరద తగ్గుముఖం పట్టడంతో అధికారులు ఊరిపిలీచుకున్నారు. వరదను సందర్శించేందుకు సందర్శకులు భారీగా తరలివచ్చారు.

వరద బాధితులను ఆదుకుంటాం : రఘురాం

విశాలాంధ్ర-కంచికచర్ల: వరదకు దెబ్బతిన్న ప్రతి ఒక్కరిని అన్ని విధాల ఆదుకునేందుకు సీఎం నారా చంద్రబాబు నాయుడు అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు విజయవాడ పార్లమెంటరీ అధ్యక్షులు మాజీ మంత్రి నెట్టెం రఘురాం పేర్కొన్నారు. కంచికచర్ల మండల పరిధిలోని కొత్తపేట గ్రామానికి చెందిన 500 కుటుంబాలను వరద ముంపునకు గురికాగా వారిని కంచికచర్ల ఓసిక్లబ్బులో క్లబ్ మెంబర్స్ సమిష్టిగా కలిసికోగంటి బాబు ఆధ్వర్యంలో పునరావాసకేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ పునరావాస కేంద్రాన్ని రఘురాం మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా రఘురాం పునరావాస కేంద్రంలోని ప్రతి ఒక్కరిని ఆప్యాయతగా పలకరిస్తూ వారి వివరాలను అడిగి తెలుసుకున్నారు. నెట్టెం రఘురాం మాట్లాడుతూ రాష్ట్రంలో తుఫాను ఒక జల ప్రళయాన్ని సృష్టించింది అన్నారు. ప్రధానంగా ఎన్టీఆర్, కృష్ణ, గుంటూరు, పల్నాడు, జిల్లాల్లో అధిక వర్షపాతం నమోదై పంటలు ప్రజలను అతలాకుతలం చేసిందన్నారు. మండలంలో ఏటిపట్టి గ్రామాల్లో వరద నీరు ఎక్కువగా ప్రవహించడంతో ప్రజలు ఆర్థికంగా నష్టపోయారన్నారు. పునరావాస కేంద్రంలో తలదాచుకున్న వారే కాక ఏటి పట్టు గ్రామాలైన కొత్తపేట, గని ఆత్కూరు, కునికినపాడు, ముస్నలూరు, మొగులూరు, గ్రామాలకు చెందిన వరద బాధితులకు సుమారు 4 వేల మందికి ఓసి క్లబ్ మెంబర్స్, కూటమి నాయకులు దాతలంతా సమిష్టిగా కలసి కోగంటి బాబు ఆధ్వర్యంలో భోజనాలు, టిఫిన్ ఏర్పాటు చేయటం అభినందనీయమని అన్నారు. వరద తగ్గిన తర్వాత దెబ్బతిన్న పంటలతో పాటు ప్రతి ఇళ్లకు రెవెన్యూ అధికారులను గ్రామాలలో పర్యటించి జరిగిన నష్టాన్ని అంచనా లు వేసి ఆఅంచనాలను ప్రభుత్వానికి పంపుతారని అన్నారు.

విజ్ఞాన్స్ అధ్యాపకుడికి పీహెచ్‌డీ ప్రధానం

విశాలాంధ్ర-గుంటూరు కలెక్టరేట్ : విజ్ఞాన్స్ యూనివర్సిటీలోని స్కూల్ ఆఫ్ ఎలక్ట్రికల్ ఎలక్ట్రానిక్స్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్ విభాగంలోని ఈఈఈ డిపార్ట్‌మెంట్‌కు చెందిన అసిస్టెంట్ ప్రొఫెసర్ పమిడి లక్ష్మీనారాయణకు తమ యూనివర్సిటీ ఈఈఈ విభాగంలో పీహెచ్‌డీ పట్టా అందజేసిందని వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ పి.నాగభూషణ్ మంగళవారం తెలిపారు. ఈయన 'ఫేసర్ మెజర్‌మెంట్ యూనిట్ ప్లేస్‌మెంట్ విత్ కంప్లీట్ అబ్జర్వబిలిటీ ఫర్ డైనమిక్ స్టేట్ ఎస్టిమేషన్ ఇన్ పవర్ సిస్టమ్' అనే అంశంపై పరిశోధన చేశారని తెలియజేసారు. పీహెచ్‌డీ పట్టాపొందిన పమిడి లక్ష్మీనారాయణను విజ్ఞాన్స్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య, వర్సిటీ వైస్ చాన్సలర్ కల్నల్ ప్రొఫెసర్ పి.నాగభూషణ్, రిజిస్ట్రార్ డాక్టర్ ఎంఎస్ రఘునాథన్ తదితరులు అభినందించారు.

ఇంజినీరింగ్ సిబ్బందిని విజయవాడకు తరలింపు

విశాలాంధ్ర-వినుకొండ: విజయవాడ నగరంలో వచ్చిన వరద ప్రాంతంలో పారిశుధ్య మరియు ఇంజనీరింగ్ పనులను నిర్వహించటానికి వినుకొండ పురపాలక సంఘం నుంచి పారిశుధ్య, ఇంజనీరింగ్ సిబ్బందిని మునిసిపల్ కమిషనర్ ఎం. సుభాష్ చంద్ర బోస్ ఆధ్వర్యంలో మంగళవారం విజయవాడ వెళ్ళమని తెలపడం జరిగింది.

ప్రెస్ క్లబ్ ఏర్పాటు చేయాలి

విశాలాంధ్ర-వినుకొండ: పట్టణంలో ప్రెస్ క్లబ్ ఏర్పాటు చేయాలని అఖిలభారత శాంతి సంఘీభావ సంఘం (ఏఐపిఎస్ఓ) రాష్ట్ర కన్వీనర్ మహంకాళి సుబ్బారావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అయన మాట్లాడుతూ నియోజకవర్గంలో ప్రజా సంఘాలు, రాజకీయ పార్టీలకు, ప్రజలకు ఎప్పుడైనా సమావేశం ఏర్పాటు చేసుకోవడానికి వారికి భవనం లేకపోవడంతో ఇబ్బంది గురవుతున్నారని తక్షణమే పట్టణంలో జర్నలిస్టులకు ప్రెస్ క్లబ్ భవనం ఏర్పాటు చేయాలని వారి సంక్షేమానికి కృషి చేయాలని ప్రభుత్వాన్ని, ప్రజా ప్రతినిధులను ఒక ప్రకటనలో కోరారు.

నిత్యావసరాలు అందజేత

విశాలాంధ్ర-చిలకలూరి పేట: చిలకలూరిపేటలోని ప్రముఖ స్వచ్ఛంగా సేవా సంస్థ అసిస్ట్ ఆధ్వర్యంలో రూ.రెండు లక్షల విలువైన నిత్యవసరాలను 150 మంది ఒంటరి మహిళలకు అందజేశారు. వీరికి నిత్య వసరాల్లో భాగమైన బియ్యం, కందిపప్పు, వంట నూనె, గోధుమపిండి అందజేశారు. ఈ సహాయాన్ని హైదరాబాద్‌కు చెందిన కేఎస్‌ఏ సంస్థ ద్వారా అందజేశారు. ఈ కార్యక్రమంలో అసిస్ట్ సంస్థ డైరెక్టర్ జాస్టి రంగారావు, అసోసియేట్ డైరెక్టర్లు కృష్ణ హరిష్, జి సూర్యనారాయణ, విష్ణుప్రియ కోఆర్డినేటర్లు డేవిడ్, దుర్గారాణి, తదితరులు పాల్గొన్నారు.

మునిగిన పొలాలను సందర్శించిన హార్టికల్చర్ డైరెక్టర్

విశాలాంధ్ర-మంగళగిరి : గుంటూరు జిల్లా మంగళగిరి మండలం నూతక్కి, రామచంద్రాపురం గ్రామాలలో హార్టికల్చర్ డైరెక్టర్ డాక్టర్ కె.శ్రీనివాసులు భారీ వర్షాల కారణంగా ముంపునకు గురై దెబ్బతిన్న పొలాలను మంగళవారం క్షేత్రస్థాయిలో సందర్శించారు. రైతు బొల్లా సతీష్ రెడ్డికు చెందిన పసుపు పొలాలను సందర్శించి, నేటి వరకు పంట వయస్సు, సాగుకు అయిన ఖర్చు గురించి రైతుతో సంభాషించారు. రెండు నెలల పంట అని, తాను సాగు కోసం రూ.1.10 లక్షలు ఖర్చు చేశానని రైతు బదులిచ్చారు. నాలుగు రోజులుగా పంట పూర్తిగా నీటిలో మునిగిపోయింది. తదుపరి గుంటూరు సుధీర్‌కి చెందిన అరటి పొలాన్ని సందర్శించారు. మిరపతో అంతరపంటగా సరిహద్దు పంట బంతి కలిగి ఉన్న మూడు నెలలు అరటి తోట పరిశీలించారు. ఈ పంట కూడా నాలుగు రోజుల నుంచి పూర్తిగా నీటిలో మునిగిపోయింది. శాస్త్రవేత్త డాక్టర్ సీవీ రమణ పొలాలను పరిశీలించారు. పెరకలపూడి డొంకను సందర్శించి రేపల్లె కెనాల్ నీటి ప్రవాహాన్ని పరిశీలించారు. వరద కారణంగా దెబ్బతిన్న రామచంద్రపురం లంక పొలాలను కూడా సందర్శించారు. చివరగా నూతక్కి సచివాలయం వద్ద రైతులతో మాట్లాడారు. రేపల్లె కెనాల్‌పై నాన్ రిటర్న్ వాల్ ఏర్పాటుకు సంబంధించి రైతులు అర్జీ అందజేశారు. భారీ వర్షాలతో నష్టపోయిన ప్రతి రైతు పొలాన్ని ఎన్యూమరేషన్‌లో నమోదు చేయాలని డైరెక్టర్ సూచించారు. నూతక్కి గ్రామంలో 200 హెక్టార్లలో అరటి, 140 హెక్టార్లలో పసుపు నీటమునిగగా, రామచంద్రపురం గ్రామంలో 28 హెక్టార్లలో అరటి, 28 హెక్టార్లలో పసుపు నీటమునిగింది. ఈ కార్యక్రమంలో బి.రవీంద్రబాబు, వజ్రశ్రీ తదితరులు పాల్గొన్నారు.

రిజర్వాయర్లను నిర్దేశిత

గడువులోపు శుభ్రం చేయాలి

కమిషనర్ శ్రీనివాసులు

విశాలాంధ్ర-గుంటూరు కలెక్టరేట్ : గుంటూరు నగర ప్రజలకు సరఫరా చేసే తాగునీటి రిజర్వాయర్లను నిర్దేశిత గడువు లోపల శుభ్రం చేయాలని, ప్రస్తుత వర్షాలతో నీటిని అధిక ప్రాధాన్యత క్రమంలో ఫిల్టర్ చేయాలని గుంటూరు నగరపాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులు ఇంజినీరింగ్ అధికారులకు స్పష్టం చేశారు. స్థానిక నాజ్‌సెంటర్‌లోని రిజర్వాయర్లను ఈఈ కోటేశ్వరరావుతో కలిసి మంగళవారం కమిషనర్ పరిశీలించారు. ఎన్ని లీటర్ల కెపాసిటి, ఏ ప్రాంతాలకు సరఫరా, సరఫరా సమయాలు, రిజర్వాయర్ క్లీనింగ్ వివరాలను ఈఈని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలోని ప్రతి రిజర్వాయర్ నిర్దేశిత గడువు మేరకు శుభ్రం చేయాలని, ప్రత్యేకంగా బోర్డు మీద నోట్ చేయాలన్నారు.

నాణ్యత పాటించాలి:

విజయవాడ నగరంలోని ముంపు ప్రభావిత ప్రాంతాల ప్రజలకు గుంటూరు నగరపాలక సంస్థ తరుపున అందించే ఆహార పదార్ధాలను అత్యంత జాగ్రత్తగా, పరిశుభ్రమైన వాతావరణంలో తయారు చేసి అందించేలా పర్యవేక్షణ అధికారులు శ్రద్ధ చూపాలని గుంటూరు నగరపాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులు స్పష్టం చేశారు. స్థానిక నాజ్‌సెంటర్‌లోని రిజర్వాయర్ వద్ద నుంచి విజయవాడకు పంపుతున్న లక్ష ఆహార, అల్పాహార పదార్ధాల ప్యాకెట్స్ వాహనాలను కమిషనర్ మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ భారీ వర్షాల వలన విజయవాడ నగరంలో ముంపుకు గురై తీవ్ర ఇబ్బందులు పడుతున్న ప్రజలకు టమాటా బాత్, వెజ్ బిర్యాని, సాంబార్ అన్నం, పెరుగన్నం, పాలు, బిస్కెట్స్, వాటర్ బాటిల్స్, బ్రెడ్ ప్యాకెట్స్‌ని పూటకి లక్ష వంతున అందిస్తున్నామన్నారు. పర్యటనలో ఈఈ కోటేశ్వరరావు, ఏఈలు సునీల్ కుమార్, పవన్ కుమార్ పాల్గొన్నారు.

వినాయకచవితి పందిళ్లకు అనుమతులు సులభతరం

విశాలాంధ్ర - కారంపూడి: వినాయక చవితి పందిళ్ల ఏర్పాటుకు అనుమతులను ప్రభుత్వం సులభతరం చేసిందని కారంపూడి సర్కిల్ ఇన్స్‌స్పెక్టర్ టివి శ్రీనివాసరావు తెలిపారు. మంగళవారం జరిగిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతు సింగిల్‌విండో యాప్ ద్వారా అనుమతుల పొందేందుకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఐదు శాఖల అనుమతులు ఈ యాప్ ద్వారా పొందవచ్చున్నారు. ప్రభుత్వ స్థలాలలో ఏర్పాటు చేసే పందిళ్లకు గ్రామ విఆర్వో వద్ద అనుమతి పొందాలన్నారు. పందిళ్ల వద్ద సిసి కెమెరాలు కమిటి వారు ఏర్పాటు చేయాలని సూచించారు. విగ్రహ నిమజ్జనం ముందు రోజు రూటుమ్యాపును పోలీసులకు తెలపాలన్నారు. ప్రజలందరు వినాయక చవితి పండుగను ఆహ్లాదకరంగా జరుపుకోవాలన్నారు.

పొలాలను శాస్త్రవేత్తలు పరిశీలన

విశాలాంధ్ర-చిలకలూరిపేట: చిలకలూరిపేట మండలం వేలూరు గ్రామంలో ఇటీవల కురిసిన అధిక వర్షాలకు నష్టపోయిన రైతుల పొలాలను మంగళవారం పరిశీలించారు. ఏరువాక కేంద్రం పల్నాడు జిల్లా శాస్త్రవేత్త వెంకట రాములు, లాం ఫాం సైంటిస్ట్ ఎస్.సాంబశివరావు, పల్నాడు జిల్లా వనరుల కేంద్రం జిల్లా శిక్షణా కో ఆర్డినేటర్ ఎం.శివ కుమారి, సహాయ వ్యవసాయ సంచాలకులు (రెగ్యులర్) నరసరావుపేట పి మస్తానమ్మ, ఎంఏవో టి శ్రీలత, రైతు సేవ కేంద్రం సిబ్బందితో కలసి సందర్శించారు. రైతులకు పలు సూచనలు తెలియజేశారు.

ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలి

-విపత్తు నిర్వహణలో సమన్వయ లోపం మాట రాకూడదు

-జూమ్ సమావేశంలో ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు

విశాలాంధ్ర-వినుకొండ: విపత్తు నిర్వహణలో సమన్వయ లోపం మాట రాకూడదని ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు వరద పరిస్థితులపై అధికారులతో ఎమ్మెల్యే జీవీ జూమ్ సమావేశం ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలని అధికారులకు ఆదేశం కొన్నిరోజులుగా పడుతున్న భారీవర్షాలు, వరదల పరిస్థితుల నేపథ్యంలో వినుకొండ నియోజకవర్గ పరిధిలో విపత్తు నిర్వహణకు సంబంధించి ఎక్కడా సమన్వయలోపం అన్న మాట రాకూడదని అధికారులకు వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు స్పష్టం చేశారు . ముఖ్యమైన విభాగాల అధికారులందరూ అన్ని వేళల అందుబాటులో ఉంటూ ప్రజలకు భరోసా కల్పించాలని ఆయన దిశానిర్దేశం చేశారు.

పలు ప్రాంతాలను ముంచేసిన భారీ వర్షాలు ఇంకా ఉండొచ్చన్న వాతావరణశాఖ హెచ్చరికల నేపథ్యంలో మంగళవారం వివిధ శాఖల అధికారులతో వరద పరిస్థితులపై ఆయన జూమ్ ద్వారా సమీక్షా సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. నియోజకవర్గంలో వరద ప్రభావం, తీసుకోవాల్సిన చర్యలపై అన్ని వివరాలు అడిగి తెలుసుకున్నారు. పంటలపై వర్షాల ప్రభావం, రైతులకు సాయం అందించాల్సిన అవసరం ఉంటే ఆ వివరాలు తెలియజేయాలని వ్యవసాయ శాఖ అధికారులకు మరోసారి స్పష్టం చేశారు. వినుకొండ పట్టణ, గ్రామీణ సీఐలు, నూజండ్ల, శావల్యాపురం, ఈపూరు, బొల్లాపల్లి మండలాల ఎస్సైలతో చర్చించి సహాయ చర్యల్లో తోడుగా ఉండాలన్నారు. మరీ ముఖ్యంగా 5, 6 తేదీల్లో మరో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ నిపుణులు చెబుతున్నారని ఈ పరిస్థితుల్లో.. ప్రజల నుంచి ఏమైనా ఫిర్యాదులు వస్తే తక్షణమే స్పందించాలి.. ఆలస్యం చేయొద్దని అన్నివిభాగాల అధికారులకు స్పష్టం చేశారు. ఎలాంటి పరిస్థితులనైనా ఎదుర్కొనేందుకు అధికార యంత్రాంగం మొత్తం సిద్ధంగా ఉండాలన్నారు.

శాఖ గ్రంధాలయాన్ని ఎమ్మెల్సీ రాజశేఖర్ సందర్శన

విశాలాంధ్ర-చిలకలూరిపేట: గ్రంథాలయాలు ఆధునిక దేవాలయాలని, నిరుద్యోగ యువత గ్రంథాలయాలను ఉపయోగించుకుని విజ్ఞానం సముపార్జించుకోని, పోటీ పరీక్షల్లో విజయం సాధించాలని ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్ అన్నారు. పట్టణంలోని శాఖ గ్రంథాలయాన్ని మంగళవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా పలువురు గ్రంథాలయంలోని పాఠకులు మర్రి రాజశేఖర్‌ను కలిసి, పలు సూచనలు, సమస్యలు ప్రస్తవించారు. ఆన్‌లైన్ పరీక్షలకు సంసిద్ధమవటానికి అవసరమైన నాలుగు కంప్యూటర్లు ఏర్పాటు చేయాలని కోరారు. దీనితో పాటు గ్రంథాలయానికి వచ్చే పాఠకుల టాయిలెట్లు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వాటిని ఏర్పాటు చేస్తే సౌకర్యంగా ఉంటుందని వెల్ల డించారు. కార్యక్రమంలో గేరా లింకన్, బైరా వెంకట కోటి, సాతులూరు కోటి, సుభాని, హిదయ తుల్లా, నిమ్మల మురళీకృష్ణ, జమీర్, ఆరా సుభాని ఉన్నారు.

నిత్యావసర సరుకులు పంపిణీ

విశాలాంధ్ర-నూజెండ్ల: పేద ప్రజల కోసం కూటమి ప్రభుత్వం ఎప్పుడు సహాయక సహకారాలు అంది స్తుందని టీడీపీ సీనియర్ నాయకులు గంగినేని బాబు అన్నారు. మండలంలోని కమ్మవారిపాలెం పరిధిలోని ఎస్టీ కాలనీకి చెందిన 45 కుటుంబాలకు ప్రభుత్వం నుండి వచ్చిన నిత్యావసర సరుకులను తహశీల్దార్ జి.రమేష్ కుమార్ మంగళవారం లబ్ధిదారులకు పంపిణీ చేశారు. నూజెండ్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి మాల కొండయ్య మెడికల్ క్యాంప్ ఏర్పాటుచేసి వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులను పంపిణీ చేశారు. ఈసందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పంపించిన 25 కేజీల బియ్యం, కందిపప్పు, పంచదార, నూనె కేజీ చొప్పున లబ్ధిదారులకు అందజేశామన్నారు. ఈకార్య క్రమంలో సిహెచ్ఓ మనోహర్ జోషి, వైద్య సిబ్బంది గ్రామస్తులు పాల్గొన్నారు.

వాటర్ ట్యాంకర్‌ను ఢీకొన్న లారీ

విశాలాంధ్ర-దాచేపల్లి: రాష్ట్ర ప్రధాన రహదారిపై వాటర్ ట్యాంకర్‌ను లారీ ఢీ కొన్న సంఘటన సోమవారం రాత్రి దాచేపల్లి వద్ద తంగెడ మూలమలుపు వద్ద జరిగింది. దాంతో రోడ్డుపై వెళ్ళే వాహనాలు ఒకదానికొకటి వరుస వెంట ఆరు ఢీకొన్నాయి. ఈ క్రమంలో ట్రాఫిక్ నిలిచిపోయింది. విషయం తెలుసుకున్న పోలీసులు వెంటనే వచ్చి పొక్లెయిన్‌ను తెప్పించి వాటర్ ట్యాంకర్‌ను తొలగించారు. ఆ తర్వాత ట్రాఫిక్‌ను క్రమబద్ధీక రించారు.

బాధితుల సాయానికి తరలిన తెలుగు యువత

విశాలాంధ్ర-గుంటూరు సిటీ: విజయవాడ ముంపు బాధితుల సహాయ కార్యక్రమాలకు జాతీయ టీడీపీ ఆదేశాల మేరకు గుంటూరు నుండి జిల్లా తెలుగుయువత అధ్య క్షులు రావిపాటి సాయి కృష్ణ ఆధ్వ ర్యంలో తెలుగుయువత విద్యార్థులు భారీగా బస్సుల్లో తరలివెళ్లారు. ఆపన్నులకు ఆపన్న హస్తం పేరుతో ఎమ్మెల్యే గళ్ళా మాధవి ఆధ్వర్యంలో పది వేల భోజన ప్యాకెట్లు, మంచి నీళ్ల బాటిళ్లు పంపిణీ చేస్తూ జెండా ఊపిన అనంతరం వరద సహాయక చర్యలకు విజయవాడ తరలి వెళ్తున్న తెలుగు యువత సభ్యులను అభినందించి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా రావిపాటి సాయి కృష్ణ మాట్లాడుతూ గుంటూరు జిల్లా తెలుగు యువత సభ్యులకు విజయవాడలోని 45,46,47 డివిజన్లలో సహాయ కార్యక్రమాల కోఆర్డినేటర్‌గా తమను నియమించారని పూర్తిగా ముంపు కంట్రోల్ లోకి వచ్చేదాకా ఇక్కడే ఉండి సహక కార్యక్రమంలో ప్రత్యక్షముగా పాల్గొంటామని తెలిపారు. ఈ కార్యక్ర మంలో మండలపు బంగారు బాబు, అర్బన్ టిడిపి ప్రధాన కార్యదర్శి ముత్తినేని రాజేష్, బండారు ప్రసాద్, కోటేశ్వరావు, వేణు పాల్గొన్నారు.

వరద బాధితులకు 'భాష్యం' చేయూత

విశాలాంధ్ర-గుంటూరు సిటీ: ఇది కష్ట సమయం, ప్రతి ఒక్కరూ స్పందించాల్సిన తరుణం, మానవత్వంతో మన పొరుగు వారికి సహాయపడాలని భాష్యం విద్యాసంస్థల చైర్మన్ భాష్యం రామకృష్ణ పిలుపునిచ్చారు. విజయవాడ వరద బాధితుల సహాయార్థం భాష్యం విద్యాసంస్థల తరపున 70 వేల పులిహోరా, పెరుగన్నం ప్యాకెట్లను పంపించినట్లు రామకృష్ణ తెలిపారు. బాధితులను ఆదుకునేందుకు భాష్యం విద్యా సంస్థల తరపున భాష్యం విద్యాసంస్థల్లో స్వయంగా తయారుచేసిన పులిహోరా, పెరుగన్నం ప్యాకెట్లను మంగళవారం విజయవాడ తరలించినట్లు రామకృష్ణ తెలిపారు. కార్యక్రమంలో భాష్యం విద్యాసంస్థల సిబ్బంది పాల్గొన్నారు.

అధికారులపై చర్యలు తీసుకోవాలి

ఎస్పీకి ఏసు పోగుల మాధురి ఫిర్యాదు

విశాలాంధ్ర-గుంటూరు సిటీ: అగ్రకులస్తులకు అండగా నిలిచి తనను అవమాన పరిచిన అధికారులపై చర్యలు తీసుకుని, తనకు రక్షణ కల్పించి న్యాయం చేయాలని మంగళవారం జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేసినట్టు ఏసు పోగుల మాధురి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వట్టి చెరుకూరు మండలం గారపాడు మాదిగ పల్లి గ్రామంలో గత సార్వత్రిక ఎన్నికలలో కొంతమంది వ్యక్తులు తాను చెప్పిన పార్టీకి ఓటు వేయమని బెదిరించారని తాను నిరాకరించి తన ఇష్టం వచ్చిన పార్టీకి ఓటు వేస్తానని చెప్పటంతో తనపై కక్ష పెట్టుకొని ఎన్నికల ఫలితాలు తర్వాత మాదిగపల్లి కు చెందిన కొంతమందితో కలిసి తమపై దాడి చేశారని ఏసుపోగుల మాధురి తెలిపారు. ఈ దాడికి సంబంధించి జూలై 29వ తేదీన జిల్లా ఎస్పీ కార్యాలయంలో తన చెల్లి సింధుతో కలిసి ఫిర్యాదు చేయడం జరిగినదని, దీనిని మనసులో పెట్టుకొని ఈ నెల 2వ తేది సోమవారం ఉదయం సమయంలో పల్లపాటి కోటయ్య అనే వ్యక్తి తనను జుట్టు పట్టుకుని దౌర్జన్యం చేసి కత్తితో దాడి చేసి నన్ను చంపేందుకు ప్రయత్నించి విపరీతంగా దుర్భాషలాడుతూ కొట్టడం జరిగిందని ఇంతలోనే పోలీస్ పికెటింగ్‌లో ఉన్న పోలీస్ కానిస్టేబుల్ వచ్చి ఇరువురిని సర్ది చెప్పినట్లు తెలిపారు. దీనికి సంబంధించి వట్టిచెరుకూరు పోలీస్ స్టేషన్లో సిఐని కలిసి ఫిర్యాదు చేయటానికి వెళ్ళగా తాను ఇచ్చిన కంప్లైంట్ తీసుకోకపోగా దుర్భాషలాడారని తెలిపారు.

మలేరియా వ్యాధిపై అప్రమత్తంగా ఉండాలి

విశాలాంధ్ర-రొంపిచర్ల: మలేరియా వ్యాధి పట్ల అప్రమత్తంగా ఉండాలి జిల్లా మలేరియా అధికారి రవీంద్ర రత్నాకర్ అన్నారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగ ళవారం ఆశా కార్యకర్తల సమా వేశం జరిగింది. ఈ సమావేశంలో పాల్గొన్న జిల్లా మలేరియా అధికారి రవీంద్ర రత్నాకర్ మాట్లాడుతూ ప్రస్తుతం కురుస్తున్న భారీ వర్షాలకు దోమలు వృద్ధి చెందే అవకాశముందని అన్నారు. దోమలు కుట్టటం వలన మలేరియా, డెంగ్యూ, టైఫాయిడ్ వంటి వ్యాధులు వచ్చే అవకాశముందని అన్నారు. ఈ వ్యాధులు రాకుండా తీసుకోవలసిన జాగ్రత్తలు గురించి వివరించారు. అదే విధంగా దోమలు వృద్ధి చెందకుండా తీసుకోవలసిన జాగ్రత్తలు గురించి కూడా వివరించారు. ఈ కార్యక్రమంలో పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ సాయి, హెల్త్ సూపర్ వైజర్ రామయ్య, హెల్త్ అసిస్టెంట్లు కిరణ్ కుమార్, సురేష్, ఎఎన్ఎంలు, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

గ్రామాల్లో ఉచిత వైద్య శిబిరం

విశాలాంధ్ర-దుర్గి: ప్రభుత్వ ఆదేశాల మేరకు మంగళవారం మండలంలో అన్ని గ్రామాల్లో వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాలు నిర్వ హించారు. ఈసందర్భంగా డ యేరియా, మలేరియా, డెంగ్యూ సంబంధించిన రక్త నమూనాలను సేకరించారు. జ్వరం, దగ్గు, జలుబు, విరేచనాలు, వాంతులు సంబంధం మాత్రలు అందజేశా రు. పరిసరాల పరిశుభ్రత, కాచి చల్లారిన నీటిని త్రాగాలని ఆరోగ్య సిబ్బంది ప్రజలకు తెలియజేశారు. ఈకార్య క్రమంలో గ్రామ పెద్దలు పులి హరి, దిగుమర్తి సుబ్బారావు, కొండా రామయ్య, రుద్రాల రవి, పంచాయతీ కార్య దర్శి శివకుమార్, టిడిపి, జన సేన నేతలు, ఆరోగ్య సిబ్బంది వి.పవిత్ర, బి.ధనలక్ష్మి, డి.మంగ మ్మ, జె.ఎల్ కోటమ్మ, వై వి రమణ, యం.లక్ష్మీ గాయత్రి, యు శివమ్మ, కె.విజయశ్రీ, యం.మేరి, వి.వెంకట్రావమ్మ, విజయలక్ష్మీ, అంకమ్మ, మల్లిక తదితరులు పాల్గొన్నారు.

బార్ అసోసియేషన్‌లో ఉచిత దంత పరీక్షలు

విశాలాంధ్ర-గుంటూరు కలెక్టరేట్ : వజ్రమ్స్ డెంటల్ క్లినిక్ డాక్టర్ రాతంశెట్టి శివ శైలేష్ ఆధ్వర్యంలో గుంటూరు బార్ అసోసియేషన్ సహకారంతో స్థానిక కోర్టు ప్రాంగణంలోని బార్ అసోసియేషన్‌లో ఉచిత దంత పరీక్షలు, సలహాలు, సూచనలు అందజేశారు. న్యాయవాదులు, న్యాయవాద గుమస్తాలు, కోర్టు సిబ్బంది ఈ శిబిరాన్ని సద్వినియోగం చేసుకున్నారు. అదేవిధంగా ఉపేంద్ర హోమియో క్లినిక్ డాక్టర్ ఉపేంద్ర ఆధ్వర్యంలో హోమియో వైద్యానికి సంబంధించి సలహాలు, సూచనలు అందజేశారు.

మండల ప్రత్యేకాధికారిగా సంజీవరావు నియామకం

విశాలాంధ్ర-రెంటచింతల: గత కొద్ది రోజుల నుంచి విస్తారంగా వర్షాలు కురుస్తున్న నేపధ్యంలో కృష్ణానదికి సమీపంలోని గ్రామాల్లో వరద, పరిస్థితిని సమీ క్షించేందుకు స్కిల్ డెవలప్‌మెంట్ జిల్లా అధికారి కె. సంజీవరావును నియమించినట్లు తహసీల్దార్ జి.కరుణకుమార్ చెప్పారు. దామెరపాడుకు ఎంపీడీవో మహాలక్ష్మి, సత్రశాలకు దుర్గి తహశీల్దార్ ఫణీంద్ర, మల్ల వరంకు తహశీల్దార్ కరుణకుమార్‌ను నియమించారు.

రైలు నుంచి జారి పడిన ప్రయాణికునికి గాయాలు

విశాలాంధ్ర-దాచేపల్లి: రైలు నుంచి జారి పడిన ఓ ప్రయాణికునికి తీవ్ర గాయాలైన సంఘటన మంగళ వారం నడికూడి జంక్షన్లో చోటు చేసుకుంది. సికింద్రా బాద్ నుంచి గుంటూరు వైపునకు వెళ్తున్న శబరి ఎక్స్ ప్రెస్ రైలు నుంచి నడికూడి స్టేషన్ లో దిగుతూ ప్రమాదవశాత్తు జారీ కింద పడ్డాడు. దాంతో ఒక చేయి పూర్తిగా విరిగి పోవడంతో పాటు తీవ్ర గాయాలయ్యాయి. రైల్వే పోలీసులు ఆ క్షతగాత్రుడిని గుంటూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

గౌరవ పిడుగురాళ్ళ సివిల్ జడ్జి (జూనియర్‌డివిజన్) పిడుగురాళ్ళ వారి కోర్టులో
O.S. No. 61 / 2022

నోటీస్
సయ్యద్ ఇస్మాయిల్. ....వాది
మరియు
షేక్ సైదా, S/o.పెదమాబు. ..... ప్రతివాది

To
షేక్ సైదా, S/o.పెదమాబు, ముస్లిం,వ్యాపారము, 38సం॥లు R/o.డోర్.నెంబర్.6-21, తిరుపతమ్మ తల్లిగుడి ఎదురు, కొండమూడు గ్రామము, రాజు పాలెం మండలం, పల్నాడు జిల్లా.

పై నెంబర్ దావాను వాది ప్రతివాది అయిన మీపై క్రీయత కోర్టులో దావా ప్రాంసరీ నోటు వడ్డీతో సహా రాబట్టు నిమిత్తము దాఖలు పరచి మీకు కోర్టు నోటీసు పలుమార్లు పంపినను తీసుకోనందున కోర్టు వారు పేపరు ప్రకటన ద్వారా తెలియజేయుటకు ఆర్డరువేసి ఉన్నారు. కావున సదరు దావా వాయిదా ది.06-09-2024వ తేదీన ఉన్నందున మీరు గాని మీ లాయర్ ద్వారా గాని పై తెలిపిన వాయిదా తేదీన ఉ॥గం॥10-30ని॥లకు పిడుగురాళ్ళ సివిల్ జడ్జ్ (జూనియర్ డివిజన్)కోను జరుపుకొనగలరని, లేని పక్షంలో మీకు పరోక్షంగా దావా జరుపబడునని ఈ నోటీసు ద్వారా తెలియజేయడం అయినది.
(ఈ నోటీసు కోర్టు వారి ఆదేశాల మేరకు జారీ చేయబడినది)
వాయిదా ది 06-09-2024.

షేక్ మౌలాలి, వాది తరపు అడ్వకేటు, పిడుగురాళ్ళ పల్నాడు జిల్లా, సెల్ నెం.9440846452

పాస్‌పోర్ట్ పోయినది

పల్నాడు జిల్లా, నాదెండ్ల మండలం, గణపవరం గ్రామం, డోరు నెం.4-24-1రు కాపురస్తులు షేక్ హుస్సేన్ గారి కుమారుడు షేక్ కాలీషావలి (సెల్: 8186953526) అను నేను నా పేరిట గల పాస్‌పోర్ట్ నెం. R4562065 ఒరిజినల్‌ను ది.28-08-2024న గుంటూరు సిటి, బృందావన గార్డెన్స్ సెంటర్‌లో పోగొట్టుకున్నాను. ఎవరికైనా దొరికిన యెడల పై చిరునామాలో తెలియజేయగలరు.

CERTIFICATES MISSING

I, Gumma Vinay, S/o. Rama Krishna, R/o. D.No. 21-2-29, Bontavari street, Sattenapalli Town & Mandal, Palnadu Dist. A.P. I lost My B-tech Certificates from D.R. A.P.J Abdul Kalam University. At Sattenapalli Bus Depot area in case if it is traced please inform me. Cell: 9381863309.

లక్ష్మణరెడ్డికి సత్కారం

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : జనసేన, అఖిల భారత చిరంజీవి యువతల ఆధ్వర్యంలో మేకల రవీంద్రబాబు నేతృత్వంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొణిదల పవన్ కళ్యాణ్ 56వ జన్మదిన సభ గుంటూరులోని శ్రీ వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రజల అభివృద్ధే ధ్యేయంగా పలు సేవా కార్యక్రమాలు..అవగాహన కార్యక్రమాలు చేస్తున్న వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డిని ఘనంగా సత్కరించారు. అదేవిధంగా 20 మంది రైతులకు ఒక్కొక్కరికి రూ. 5వేలు చొప్పున నగదు కూడా అందజేశారు. అలాగే మరో 25 మంది ఉత్తమ ఉపాధ్యా యులను, స్కూల్ డైరెక్టర్లను సత్కరించారు.

ఎమ్మెల్యే ధూళిపాళ్ళ సహకారం మరవలేనిది

ఏఎన్‌యూ విశ్రాంత ఉద్యోగి మేకా ప్రకాష్

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : మంచి మనస్సున్న ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్ర అని ఏఎన్‌యూ విశ్రాంత ఉద్యోగి మేకా ప్రకాష్ కొనియాడారు. హస్నా తుఫాను వల్ల గత నాలుగు రోజులుగా పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్ర నంబూరు యానాది కాలనీ, సుందరయ్య కాలనీలో ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రజలను..చుట్టు పక్కల ఉన్న లోతట్టు ప్రాంత ప్రజలను సరైన సమయంలో అధికారులను అప్రమత్తంగా చేసి హైస్కూల్‌కి తరలించారు. ఈ సందర్భంగా మంగళవారం వారికి ఎమ్మెల్యే సహకారంతో..స్వోప్ ఫౌండేషన్ డైరెక్టర్ డాక్టర్ డి.కొండలరావు (డీకే)ఆధ్వర్యంలో అల్పాహారం అందించారు. అనంతరం మేకా ప్రకాష్ మాట్లాడుతూ ఆపదలో ఉన్న పేదవారిని ఆదుకొనటంలో ఎమ్మెల్యే నరేంద్ర ఎప్పుడూ ముందుంటారన్నారు. ప్రకృతి విపత్కర పరిస్థితుల్లో బడుగు, బలహీన వర్గాల ప్రజలకు స్వోప్ ఫౌండేషన్ డైరెక్టర్ డాక్టర్ డి.కొండలరావు చేస్తున్న సేవలు అనిర్వచనీయమని కొనియాడారు. బెజ్జాం సంపత్, గ్రంధం గంగయ్య చిరంజీవి సహకారంతో పిల్లలకు.. పెద్దలకు అల్పాహారం అందజేశారు. ఈ కార్యక్రమంలో అబ్రహం, గ్రామ పిల్లలు, పెద్దలు పాల్గొన్నారు.

ప్రజారోగ్యాన్ని పరిరక్షించండి

-షేక్ సుభాని

విశాలాంధ్ర-చిలకలూరిపేట: కురుస్తున్న వర్షాలతో అసలే అంతంత మాత్రంగా ఉన్న ప్రజారోగ్యం మరింతగా దిగజారే పరిస్థితి ఉందని, అంటు వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని ఏఐవైఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు షేక్ సుభాని ఆందోళన వ్యక్తం చేశారు. మంగళవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ఇప్పటికే రాష్ట్రంలో పలు చోట్ల సీజనల్ వ్యాధులు విజృంభిచాయని, డయేరియా, డెంగీ, మలేరియా, టైఫాయిడ్‌తో ప్రజలు ఇబ్బంది పడుతు న్నారని వెల్లడించారు. ఇటీవల డయేరియా వి జృంభించిందని, స్వయాన మున్సిపల్ శాఖ మంత్రి పర్య టించినా కట్టడి కాలేదన్నారు. కూలీ నాలీ చేసుకొనే ప్రజ లు చిన్నపాటి అనారోగ్యం సంభవించినా ఆ ప్రభావం కు టుంబంపై పడుతుందన్న విషయాన్ని పాలకులు గమ నించాలన్నారు. వ్యాధులు దరిచేరక ముందే ముందస్తు చర్యలు తీసుకోవాలని, ప్రజారోగ్యాన్ని పరిరక్షించాలని కోరారు.

రైతులకు అండగా నిలబడతాం

ఎమ్మెల్యే జేబీఆర్

విశాలాంధ్ర-మాచర్ల: ఇటీవల కురిసిన భారీ వర్షాల ధాటికి మండలంలోని కొత్తపల్లిలో నీట మునిగిన పంట పొలాలను మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మారెడ్డి మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బ్రహ్మారెడ్డి మాట్లాడుతూ రైతులు అధైర్య పడవద్దని, రైతులకు ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. త్వరలో అధికారులచే సర్వే నిర్వహించడం జరుగుతుందని, నష్టం వాటిల్లిన పంట పొలాల రైతులకు తగిన నష్టపరిహారం చెల్లిస్తామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా కురిసిన భారీ వర్షాలకు ప్రజలు ఇబ్బందుల పాలవడంతో పాటు రైతులకు తీవ్ర నష్టం జరిగిందన్నారు. వరద బాధితులను అన్ని రకాలుగా ఆదుకునేందుకు కోసం అధికారులతో పాటు సీఎం చంద్రబాబు కూడా స్వయంగా రంగంలోకి దిగారన్నారు. స్వయంగా రంగంలోకి దిగిన సీఎం చంద్రబాబు పై మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్, ఆయన అనుచరులు చేస్తున్న దుష్ప్రచారాన్ని ప్రజలు నమ్మడం లేదన్నారు. వరద ముప్పుతో తీవ్ర ఇబ్బందులు పడుతున్న ప్రజలను కాపాడే ప్రయత్నాన్ని మానేసి జగన్ విమర్శలతో నీచ రాజకీయాలకు పాల్పడుతున్నారన్నారు. మరో రెండు రోజులపాటు రాష్ట్రవ్యాప్తంగా వర్షాలు పడే అవకాశాలు ఉన్నాయంటూ వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసిందని, విషయంపై ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని ఆయన కోరారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు అక్కిరెడ్డి, ఏడిఏ జగదీశ్వరరెడ్డి, ఏవో కట్టా లక్ష్మారెడ్డి రైతులు తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులకు బాసటగా ఎమ్మెల్యే మాధవి

విశాలాంధ్ర-గుంటూరు సిటీ: తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, మంత్రి నారా లోకేష్ పిలుపు మేరకు ఎమ్మెల్యే గళ్ళా మాధవి విజయవాడ వరద బాధితులకు శ్రీ భ్రమర ట్రస్ట్ అధినేత గళ్ళా రామ చంద్రరావు సహకారంతో అన్నార్తులకు 10,000 భోజన ప్యాకెట్లు, 20000 వాటర్ బాటిళ్ల వాహనాలకు ఎమ్మెల్యే గళ్ళా మాధవి పచ్చ జెండా ఊపి పంపారు. ఈ సందర్భముగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అకాల వరద భీభత్సానికి విజయవాడ పూర్తిగా మునిగిపోవటం, లక్షల మంది వరదల్లో ఉండటం బాధాకరమని అన్నారు. ఆంధ్రప్రదేశ్ హోటల్ అసోసియేషన్ తరపున 20,000 వాటర్ బాటిల్లను అందజేసిన గళ్ళ రామ చంద్రరావుకు ఎమ్మెల్యే ధన్యవాదాలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ముత్తినేని రాజేష్, మండలపు బంగారు బాబు, వై. సాంబశివరావు, పి.సుబ్రమణ్యం, వేణు గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

12లోపు వాహనాలు రిజిస్ట్రేషన్ చేసుకోవాలి

ఉప రవాణా కమిషనర్ షేక్.కరీమ్

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : ఇసుక రవాణా చేసే లారీ యజమానులు తప్పనిసరిగా మైన్స్ డిపార్ట్‌మెంట్ పోర్టల్ ద్వారా తమ వివరాలను తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని గుంటూరు ఉప రవాణా కమిషనర్ షేక్.కరీం అన్నారు. మంగళవారం గుంటూరు డీటీసీ కార్యాలయంలో రవాణా, మైన్స్ డిపార్ట్‌మెంట్‌కు ఇసుక సరఫరా చేసి లారీ యజమానులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీటీసీ షేక్.కరీం మాట్లాడుతూ అనుమతి పొందిన వాహనాలను మాత్రమే ఇసుక రవాణాకు అనుమతించబడుతుందన్నారు. ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ పొందిన లారీలు, ట్రాక్టర్లకు సరఫరా చేసే అనుమతింబడుతుందని పేర్కొన్నారు. ఇసుక సరఫరా చేసే లారీ, ట్రాక్టర్ వాహనాల యజమానులు ఈ నెల 12వ తేదీ లోపల రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. ఏమైనా అనుమానాలు, ఇబ్బందులు ఉంటే ఆర్టీఓ గుంటూరు వారిని సంప్రదించాలని కోరారు. ఈ సమావేశంలో డీడీ మైన్స్ చంద్రశేఖర్, ఆర్టీఓ గోపాల్, లారీ యజమానులు పాల్గొన్నారు.

ఆహార పొట్లాలు పంపిణీ

విశాలాంధ్ర-తుళ్ళూరు : రాజధాని ప్రాంతంలోని తుళ్ళూరు మండలంలో కృష్ణానది ముంపుకు గురైన హరిశ్చంద్రాపురం, రాయపూడి గ్రామాలలో..తుళ్ళూరులోని వడ్డెర కాలనీలో తిరుగుతూ మండల తెలుగు యువత అధ్యక్షులు మాల్పూరి నరేష్ చౌదరి ఆహార పొట్లాలు మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నరేష్ చౌదరి మాట్లాడుతూ సీఎం చంద్రబాబు స్ఫూర్తి, తాటికొండ నియోజకవర్గం ఎమ్మెల్యే తెనాలి కుమార్ ఆదేశాలతో వరద బాధి తులకు ఆకలి తీర్చడానికి ఆహార పొట్లాలు పంపిణీ చేస్తున్నామని తెలిపారు. సాధారణ పరిస్థితులు నెలకొనేంత వరకు టీడీపీ, తెలుగు యువత వరద బాధితులకు అండగా ఉంటుందన్నారు. టీడీపీ కార్యకర్తలు, యువత పాల్గొన్నారు.

ఆయిల్ ట్యాంకర్ దగ్ధం

విశాలాంధ్ర-మంగళగిరి : మంగళగిరి మండలం ఖాజా గ్రామం సమీపంలో నేషనల్ హైవే పై విజయవాడ ఆటోనగర్ నుంచి గుంటూరు వైపు వెళ్ళు మినీ ఐఓసీ ఆయిల్ ట్యాంకర్‌లో వెనుక వైపు ఎడమ చక్రం టైర్ డ్రమ్ము పట్టివేసి మంటలు రావడం జరిగింది. అది గమనించిన డ్రైవర్ హుటాహుటిన పోలీస్ వారికి టోల్‌గేట్ సిబ్బందికి సమాచారం అందించగా వెంటనే స్పందించి మంటలను అదుపు చేయడం జరిగింది. ఆయిల్ ట్యాంకర్ ఖాళీగా ఉండటంతో పెను ప్రమాదం తప్పింది. ఫైర్ ఆస్టింగ్ విషెస్ వాహనాల్లో ఉపయో గించాలని రూరల్ ఎస్సై వెంకట్ తెలిపారు.

ఎల్ఐసీని ఆర్థికంగా బలోపేతం చేద్దాం

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : ఎల్ఐసీని ఆర్థికంగా బలోపేతం చేస్తేనే అది దేశ ఆర్థిక వ్యవస్థ బలం చేకూర్చి అంతిమంగా దేశానికి, పాలసీదార్లు ఎంతో ప్రయోజనం చేకూరుతుందని విద్యావేత్త, ఎల్ఐసీ పాలసీదారులు ఇ.చంద్రయ్య అన్నారు. ఎల్ఐసీ 68 యేళ్ళ ప్రస్థానం సందర్భంగా స్థానిక అవగాహన సంస్థ కార్యాలయంలో 'ఎల్ఐసీ పాలసీదారుల' సమావేశం మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా చంద్రయ్య మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ఏటా నాలుగు లక్షల కోట్ల రూపాయల వరకు పెట్టుబడులు సమకూరుస్తూ సుమారు 15 లక్షల మంది నిరుద్యోగులకు బీమా సలహాదారులుగా స్వయం ఉపాధి కల్పిస్తున్న ఎల్ఐసీ దేశ ప్రగతిలో తనదైన ముద్ర వేస్తూ ముందుకు సాగటం గొప్ప విషయమని అన్నారు. ఈ సమావేశంలో విశ్లేషకులు వీవీ రావ్, గుప్త తదితరులు పాల్గొన్నారు.

పంట పొలాలను శాస్త్రవేత్తల బృందం పరిశీలన

విశాలాంధ్ర-పొన్నూరు : పొన్నూరు మండలంలోని వెల్లలూరు, గోళ్లమూడిపాడు గ్రామాలలోని పంట పొలాలను మంగళవారం గుంటూరు డాట్ సెంటర్ శాస్త్రవేత్తలు డాక్టర్ నగేష్, డాక్టర్ ప్రతిభ, డాక్టర్ కిషోర్ బృందం పరిశీలించారు. పొలాలలోని నీటిని వెంటనే బయటికి పంపి ఎకరాకు బూస్టర్ డోస్‌గా 30 కిలోల యూరియా 15 కిలోల మ్యూరేట్ ఆఫ్ పొటాషియం చల్లి పంటలను రక్షించుకోవాలని రైతులకు పలు సూచనలు ఇచ్చారు. ఏడీఏ రామకోటేశ్వరి, ఏవో దేగల వెంకట్రామయ్య పాల్గొన్నారు.

క్యాజువల్ వర్కర్ల తొలగింపు పున:పరిశీలన చేయాలి

విశాలాంధ్ర-మంగళగిరి : ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో నియమితులైన క్యాజువల్ వర్కర్ల తొలగింపుపై యునివర్సిటీ యాజమాన్యం పున:పరిశీలన చేయాలని మాజీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ పి.రాజశేఖర్ కోరారు. సోమవారం 21 మంది క్యాజువల్ వర్కర్లను తొలగిస్తూ యునివర్సిటీ ఆదేశాలు ఇచ్చినట్లు పలు పత్రికల్లో వార్తలు వచ్చిన నేపథ్యంలో ప్రొఫెసర్ రాజశేఖర్ స్పందించారు. గడిచిన ఐదు సంవత్సరాలలో అంతకుముందు నియమితులైన వారిని తొలగించలేదని స్పష్టం చేశారు. దిన దినబివృద్ధి చెందుతున్న యునివర్సిటీలో ఉద్యోగాల కల్పన ఉండాలని, తొలగింపు ఉండకూడదని సూచించారు. 21 మంది క్యాజువల్ వర్కర్ల నియామకంలో ఎక్కువ మంది పేదలు ఉన్నారని వివరించారు. వీరి నియామకంలో ఎటువంటి అవినీతి జరగలేదని అన్నారు.

పంటకోత ప్రయోగంపై సమీక్ష సమావేశం

విశాలాంధ్ర-రొంపిచర్ల: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం రెవెన్యూ, వ్యవసాయ శాఖల సంయుక్త ఆధ్వర్యంలో పంటకోత ప్రయోగం పై సమీక్ష సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పాల్గొన్న తహసీల్దార్ నిర్మల మాట్లాడుతూ ప్రభుత్వం రైతులు సాగు చేస్తున్న పంటలను నమోదు కొరకు నూతన సాంకేతికను ప్రవేశ పెట్టిందని అన్నారు. ఈ కార్యక్రమంలో విఆర్‌ఓలు, విలేజ్ అగ్రికల్చరల్ అసిస్టెంట్లు, రెవెన్యూ, వ్యవసాయ శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

విశాలాంధ్ర

బుధవారం 04 సెప్టెంబరు । 2024

పంట పొలాలను పరిశీలించిన ఏపీ స్పెషల్ చీఫ్ సెక్రటరీ

విశాలాంధ్ర-పెదకాకాని : గత కొన్ని రోజులుగా కురుస్తున్న అకాల వర్షాల వలన దెబ్బతిన్న పంట పొలాలను ఏపీ స్పెషల్ చీఫ్ సెక్రటరీ రాజశేఖర్ మంగళవారం పరిశీలించారు. ఉప్పలపాడు, వెంకట కృష్ణాపురం, నంబూరు గ్రామాల్లో సుడిగాలి పర్యటన చేశారు. ఈ సందర్భంగా రాజశేఖర్ ఆయా గ్రామాల్లోని రైతులతో పంట నష్టపోయిన వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పొలాల్లో నీరు పూర్తిగా పోయిన తర్వాత క్షేత్రస్థాయిలో వ్యవసాయ అధికారులు వ్యవసాయ సహాయకులు పంట నష్టం ఎన్యుమరేషన్ చేసి నివేదికలు పంపించాలని స్థానిక అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ ఎస్.ఢిల్లీ రావు, డిస్ట్రిక్ అగ్రికల్చర్ ఆఫీసర్ నున్న వెంకటేశ్వర్లు, జనసేన జిల్లా అధ్యక్షులు గాదె వెంకటేశ్వరరావు, సహాయ వ్యవసాయ సంచాలకులు సునీల్ కుమార్, మండల వ్యవసాయ అధికారిని పి.సంధ్యారాణి తదితరులు పాల్గొన్నారు.

వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించిన ఎమ్మెల్యే చదలవాడ

విశాలాంధ్ర-నరసరావుపేట: విజయవాడ నగరంలోని 40వ డివిజన్ భవానీపురం బస్టాండ్, బాల భాస్కర్ నగర్‌లో మంగళ వారం డాక్టర్ అరవింద బాబు పర్యటించారు. వరద బాధితులకు భరోసా కల్పించారు. గత ప్రభుత్వ హయాంలో కాలువలను శుభ్రం చేయకపోవడం, సిల్టు తొలగించకపోవడం, పూడిక తొలగించకపోవడంతోనే వరద ముప్పు తలెత్తిందన్నారు. సీఎం చంద్రబాబు నాయుడు గత మూడు రోజులుగా విజయవాడలోనే మకాం వేసి మరీ పనుల్ని పర్యవేక్షిస్తున్నారన్నారు. త్వరలోనే మొత్తం వ్యవస్థను మెరుగు పరిచి, ప్రతి బాధితుడికి సైతం న్యాయం చేస్తామన్నారు. విజయవాడ మొత్తాన్ని సుందరంగా తీర్చిదిద్దే బాధ్యత చంద్రబాబు నాయుడు తీసుకున్నారని, అందుకు ప్రజలు కూడా సహకరించాలని కోరారు.

బాధితులకు కూరగాయాలు పంపిణీ

విశాలాంధ్ర-మంగళగిరి : విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ సహకారంతో మంగళగిరి పట్టణంలోని 5, 6, 9 వార్డులలో టీడీపీ నాయకులు కూరగాయలు పంపిణీ చేశారు. వరద ముంపునకు నిరాశ్రయులైన 400 కుటుంబాలకు మంత్రి నారా లోకేష్ స్థానిక నాయకుల ద్వారా కూరగాయలు పంపిణీ చేయించారు. ఈ సందర్భంగా గుంటూరు పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి పోతినేని శ్రీనివాసరావు మాట్లాడుతూ మంత్రి నారా లోకేష్ ముంపు ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి పెట్టి ప్రజలకు అవసరమైన సహాయ కార్యక్రమాలు చేపడు తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు దామర్ల రాజు, ఉపాధ్యక్షులు గోవాడ దుర్గారావు, ప్రధాన కార్యదర్శి షేక్ రియాజ్ పాల్గొన్నారు.

రామాపురాన్ని సందర్శించిన కలెక్టర్ అరుణ్ బాబు

విశాలాంధ్ర-దాచేపల్లి: పల్నాడు జిల్లా కలెక్టర్ అరుణ్ బాబు మంగళ వారం రామాపురాన్ని సందర్శించారు. అక్కడి పునరావాస కేంద్రానికి వెళ్లి వరద బాధితులకు నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. గ్రామంలో డ్వాక్రా సంఘాల మహిళలకు వడ్డీ లేని రుణాలకు సంబంధించిన నగదు చెక్కులను అందజేశారు. తహశీల్దార్ కుటుంబరావు, టీడీపీ నేత వేముల వినోద్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అధికారులు అప్రమత్తంగా ఉండాలి

☞ వరదల వలన దెబ్బతిన్న ప్రాంతాల్లో ఎన్యుమరేషన్ పూర్తి చేయాలి

☞ టెలీ కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి

విశాలాంధ్ర-గుంటూరు కలెక్టరేట్ : జిల్లాలో వరద పరిస్థితులు, తీసు కుంటున్న సహాయక చర్యలపై మున్సి పల్ కమిషనర్లు, ఆర్‌డీఓ, ఎంపీడీఓలు, తహశీల్దార్లు, మెడికల్, జిల్లా పరిషత్, పంచాయితీరాజ్, ఆర్ అండ్ బీ, పశు సంవర్థక శాఖ, చేనేత జౌళి శాఖ, సివిల్ సప్లయిస్ అధికా రులతో జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి మంగళవారం టెలీకాన్ఫరెన్స్ నిర్వ హించారు. గత నెల 30, 31 తేదీల్లో కురిసిన వర్షాల కారణంగా కృష్ణా నదికి 11.4 లక్షల క్యూసెక్కుల నీరు డిశ్చార్జ్ అయిందన్నారు. అయితే ఈ రోజు ఉదయం 8.6 లక్షల క్యూ సెక్కులకు తగ్గిందని తెలుపుతూ ఈ నెల 3, 4, 5వ తేదీలలో మోడరేట్‌గా 65 మిల్లీ మీటర్ల వర్షాలు పడే అవకాశం ఉన్నందున సంబంధిత అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. కర్నాటక, తెలంగాణా రాష్ట్రాల్లో పడే వర్షం కృష్ణా నదికి రావచ్చని తెలిపారు. అందువల్ల వరద ప్రాంతాల్లో విధులు నిర్వహిస్తున్న అధికారులు అప్రమత్తంగా ఉండాల న్నారు. నీట మునిగిన ప్రాంతాల కాలనీలలో నీరు తొల గించేందుకు అవసరమైన చర్యలు తీసుకొని ప్రజలకు సౌకర్యాన్ని కల్పించా లన్నారు. జిల్లాలో ఇప్పటికే వరద వల్ల ఏడుగురు చనిపోయారని, ఇక ఎలాంటి ప్రాణ నష్టం జరగడానికి వీలు లేదన్నారు. 25 కిలోల బియ్యం, ఒక కేజీ కందిపప్పు, ఒక కేజీ చక్కెర, కేజీ పామాలిన్ ఆయిల్, కేజీ బంగాళాదుంప, కేజీ ఉల్లిపాయాలను ఒక కిట్‌గా చేసి కుటుంబానికి పంపిణీ చేయడానికి చర్యలు తీసుకోవాలన్నారు. ఎన్యుమరేషన్ పూర్తి చేసి ఈ రోజు సాయంత్రం నుంచి కిట్లను పంపిణీ చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వ నిబంధనల మేరకు మత్స్యకారులు, వీవర్స్ కుటుంబాలకు 50 కేజీల బియ్యం అందించాల్సి ఉందన్నారు. ఈ వరదల వల్ల జరిగిన పశు మర ణాలను ఎన్యుమరేట్ చేయాలన్నారు. అలాగే వరద ప్రభావిత ప్రాంతాలలోని పశువులకు పశుగ్రాసం సరఫరాకు పశు సంవర్థక శాఖ అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు. వరద నీరు తగ్గుముఖం పడుతున్నందున ఆ ప్రాంతాల్లో పారిశుద్ధ్య పనులతో పాటు కాలువల పూడికతీత పనులు చేపట్టాలని జిల్లా పంచాయితీ అధికారిని ఆదేశించారు. జిల్లాలో చనిపోయిన ఏడుగురికి ఒక్కొక్కరికి రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియా అందించాల్సి ఉందన్నారు. జాయింట్ కలెక్టర్ ఏ.భార్గవ్ తేజ మాట్లాడుతూ వరద ప్రభావిత ప్రాంతాలలోని 8200 కుటుంబాలకు నిత్యావసర సరుకుల పంపిణీకి కిట్లను సిద్ధం చేయడం జరిగిందని తెలిపారు. వాటిని ఎంఎల్ఎస్ పాయింట్ల వద్ద సిద్ధంగా ఉంచి పంపిణీకి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

పంట పొలాలను పరిశీలించిన సీపీఐ బృందం

విశాలాంధ్ర-అమరావతి: వరదల కారణంగా కొద్ది రోజులలో చేతికొచ్చే పంట పూర్తిస్థాయిలో దెబ్బతింటంతో రైతులు దిక్కుతోచని పరిస్థితుల్లో ఉన్న వారితో పాటు, పంట పొలాలను సీపీఐ బృందం మంగళవారం పరి శీలించింది. ఈ సందర్భంగా పల్నాడు జిల్లా సిపిఐ కార్యవర్గ సభ్యులు శరణం లక్ష్మీనారాయణ మాట్లాడుతూ వరదల కారణంగా అమరావతి మండల పరిధిలోని వివిధ గ్రామాలలో వాణిజ్య పంటలు పూర్తిస్థాయిలో దెబ్బతిన్న వాటిని ప్రభుత్వం వ్యవసాయ అధికా రులు అంచనా వేసి రైతులకు నష్టప రిహారం అందించేందుకు యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. అలానే వరదలు వచ్చే ముందు కన్నా వరదలు రాక మునుపే కరకట్టలను యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు చేపట్టి గ్రామీణ ప్రాంతాలు నష్టం వాటిల్లకుండా ప్రభుత్వం చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందని అన్నారు. బృందంలో చెన్నకేశవరావు, కె ఆరోగ్య రావు, సంఘ రాయప్ప, విశ్వనాథం , మాణిక్యం, కే చెంచు తదితరులు పాల్గొన్నారు.

వరద తగ్గు ముఖం

పంట కాపాడుకోవడానికి రైతుల ప్రయత్నం

విశాలాంధ్ర-దుగ్గిరాల : మండలంలోని పెదకొండూరు, వీర్లపాలెం, గొడవర్రు గ్రామాల్లో ఉన్న కరకట్ట లంక గ్రామాలలో వరద తగ్గు ముఖం పట్టింది. గత రెండు రోజులుగా 11 లక్షల పైబడి క్యూసెక్కుల నీరు రావ డంతో ఉద్యాన, వరి పంటలు, అలయాలు మునిగి పోయాయి. కొన్ని గ్రామాల్లో వరి పంట కొంత బయటికి కనిపించడంతో రైతులు పంట కాపాడుకోవడానికి తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. వరద నీటి నుంచి బయ టపడిన పంటను కాపాడుకునేందుకు తీసుకోవలసిన జాగ్రత్తలను వ్యవసాయ అధికారులు రైతులకు వివరి స్తున్నారు. మంగళవారం సాయంత్రానికి 7.25 లక్షల క్యూసెక్కుల వరద నీరు రావడంతో కరగట్ట గ్రామస్తులు ఊపిరి పీల్చుకుంటున్నారు. పంట పొలాలు కొంత భాగం కనిపించడంతో వరద ప్రవాహం తగ్గడంతో ప్రజలు, రైతులు పంటలపై ఆశలు పెట్టుకుంటున్నారు. రెవెన్యూ, పోలీసు అధికారులు గ్రామాల్లో పర్యవేక్షిస్తున్నారు.

రెండు గుర్తు తెలియని మృతదేహాలు లభ్యం

విశాలాంధ్ర-పెదకాకాని: పెదకాకాని మండల పరిధిలో సోమవారం నాడు రెండు గుర్తు తెలియని మృదేహాలను స్థానిక పోలీస్ వారు గుర్తించినట్లు సిఐ టీవీ నారాయణ స్వామి తెలియజేయడం జరిగింది. ఒక మృదేహం గుంటూరు ఛానల్లో మరొక మృతదేహం నాగరాజు కాలనీ గుంటూరు డ్రైన్‌లో కొట్టుకు వచ్చినట్టుగా సిఐ నారాయణస్వామి తెలిపారు. మృతులు వివరాలు తెలియాల్సి ఉంది.

రాయల్ ఎన్‌ఫీల్డ్ నుంచి ది 2024 క్లాసిక్ 350

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): రాయల్ ఎన్‌ఫీల్డ్ మోటార్‌సైకిల్ కొత్త అవతారంలో విడుదల విడుదలవుతోంది. ది 2024 క్లాసిక్ 350 సగర్వంగా తన మూలాలకు కట్టుబడి ఉంటూ, యాక్సెసిబిలిటీని కాపాడుకుంటోంది. కొత్త 2024 క్లాసిక్ 350 అప్‌డేట్ చేసిన నూతన ఫీచర్‌లు, అబ్బురపరిచే కొత్త రంగులలో రూ. 1,99,500 ప్రారంభ ధరతో లభిస్తుంది. దేశ వ్యాప్తంగా బుకింగ్, టెస్ట్ రైడ్‌లు సెప్టెంబరు 1 నుంచి ప్రారంభమవుతాయి. హెరిటేజ్ (మద్రాస్ రెడ్, జోధ్‌పూర్ బ్లూ), హెరిటేజ్ ప్రీమియం (మెడాలియన్ కాంస్యం), సిగ్నల్స్ (కమాండో శాండ్), డార్క్ (గన్ గ్రే అండ్ స్టెల్త్ బ్లాక్), క్రోమ్ (ఎమరాల్డ్) - 2024 రాయల్ అనే ఐదు కొత్త వేరియంట్‌లలో, ఏడు ప్రకాశవంతమైన రంగుల్లో అందుబాటులోకి వచ్చింది.

అధునాతన సిరీస్ 4 హోమ్ లిఫ్ట్‌లను విడుదల చేసిన నిబావ్

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): భారతదేశంలో అతిపెద్ద హోమ్ ఎలివేటర్ బ్రాండ్ నిబావ్ లిఫ్ట్, తమ విప్లవాత్మక నిబావ్ సిరీస్ 4 హోమ్ లిఫ్ట్‌లను పరిచయం చేసింది. ఈ కొత్త ఆవిష్కరణ అసాధారణమైన డిజైన్‌తో అధునాతన సాంకేతికతను సజావుగా అనుసంధానిస్తూ, విజయవాడ గృహ యజమానులకు విలాసవంతమైన అనుభవాన్ని అందిస్తుంది. కచ్చితమైన నావిగేషన్, సున్ని తమైన ల్యాండింగ్ కోసం ఏఐ ఆధారిత క్యాబిన్ డిస్‌ప్లే, సహజమైన ఎల్‌ఓపీ డిస్‌ప్లే, లిడార్ 2.0 టెక్నాలజీ వంటి అత్యాధునిక ఫీచర్లతో కూడిన సౌక ర్యాన్ని అందిస్తుంది. నిబావ్ సిరీస్ 4 లిఫ్ట్‌లు హోమ్ ఎలివేటర్ పరిశ్రమలో ఒక గొప్ప పురోగతిగా నిలుస్తాయి.

ఎస్ఎమ్ఎఫ్‌జి

ఇండియా క్రెడిట్ వెయ్యివ శాఖ ప్రారంభం

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): భారతదేశపు బ్యాంకేతర ఆర్థిక రంగం (ఎన్‌బిఎఫ్‌సి)లోప్రముఖసంస్థ అయినఎస్ఎమ్ఎఫ్‌జి ఇండియా క్రెడిట్ కంపెనీ లిమిటెడ్ వాషి, నవీ ముంబైలో తమ 1000వ శాఖను ప్రారంభిస్తున్నట్లు తెలిపింది. ల్యాండ్‌మార్క్ వంటి ఈ సంఘటనవలన దేశంలో తమ ప్రాభవాన్ని విస్తరించడం, వ్యాప్తి తక్కువగా ఉన్న మార్కెట్లకు కూడా ఆర్థిక సేవలను అందించాలన్న దృఢనిశ్చయాన్ని కి గుర్తుగా ఒక ప్రత్యేక కవర్‌ని, మై స్టాంప్‌ని విడుదల చేయడానికి ఎస్ఎమ్ఎఫ్‌జి ఇండియా క్రెడిట్ ఇండియా పోస్ట్ తో చేతులు కలిపిందనీ ఆ సంస్థ ఏపీ ప్రతినిధి చెప్పారు. ఈ అధికారిక విడుదల ఉత్సవ సభను, ముంబై లోని జపాన్ కాన్సలేట్ జనరల్ నుండి కాన్సల్ జనరల్ యాగి కోజి, మహారాష్ట్ర సర్కిల్ తపాలా సేవల (హెచ్‌క్యూ) నిర్దేశకులు అభిజిత్ బన్సోడేలతోబాటు, ఎస్ఎమ్ఎఫ్‌జి ఇండియా క్రెడిట్ ఎమ్ డి శాంతను మిత్రా పాల్గొన్నారు. 1000 వ శాఖను ప్రారంభించడం, అతి పెద్దదైన, వైవిధ్య భరితమైన భారతీయ మార్కెట్లో లోతుగా విస్తరించడం పట్లఎస్ఎమ్ఎఫ్‌జి ఇండియా క్రెడిట్ యొక్క వ్యూహాత్మక దృష్టికోణానికి చిహ్నంగా నిలిచిందన్నారు.

గణేష్ ఉత్సవానికి అనుమతి తప్పనిసరి

విశాలాంధ్ర-పెదకాకాని: స్థానిక పోలీస్ స్టేషన్లో మండల పరిధిలోని వినాయక చవితి ఉత్సవాలు చేస్తున్న కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఎలాంటి వివాదాలకు తావివ్వకుండా ప్రశాంత జరుపుకోవాలని సీఐ నారాయణస్వామి కోరారు. మంగళవారం.